మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

13.2.2025
గురువారం thursday

సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 303

పేజీలు : 8
Pages : 8

Published from : Karimnagar


## టీమ్ఇండియా ఆల్‌రౌండ్ షో

ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్





సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


# నోటాకు నో



- తీవ్రంగా వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు
- ఏకగ్రీవాల పేరుతో దందాలను అరికట్టాలన్న ఈసీ
- రాజకీయ పార్టీలతో భేటీలో కుదరని ఏకాభిప్రాయం
- రేపటి వరకు లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఈసీ ఆదేశం

### నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రతిపాదించిన ఈసీ

జనతా న్యూస్, హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్ద అనే అంశం రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయింది. కాంగ్రెస్ పార్టీ ఈ పద్ధతిని వ్యతిరేకించగా బిఆర్ఎస్ పార్టీ స్వాగతించింది. బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘంకి ఆ అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పింది. సిపిఎం నోటా ఉండాలని.. కానీ అభ్యర్థిగా గుర్తించోద్దని స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయింది. ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటాను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా

మిగతా 2 లో



# ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

- మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయానికి ప్రారంభం

ఫ్రాన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అధికారిక పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారంనాడు పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. దక్షిణ మార్సెయిల్‌లోని మజార్గ్యూస్ యుద్ధ శ్మశానవాటికను సందర్శించి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు.

**జనతా న్యూస్, న్యూఢిల్లీ :** ప్రధాని వెంట ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా హాజరయ్యారు. మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని కూడా మోదీ, మాక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. కాంటినెంటల్ ఫ్రాన్స్‌లో తొలి భారత రాయబార కార్యాలయం ప్రారంభించడం ద్వారా ఇరుదేశాల మధ్య మరింత లోతైన సంబంధాలు ఏర్పడటంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, మల్టీ డైమన్షయల్ రిలేషన్‌షిప్‌కు బలం చేకూరిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. దీనికి ముందు పారిస్‌లో

మిగతా 2 లో

## ఉచితంగా డబ్బులొస్తే పని చేస్తారా?



02

- సోమరులను తయారు చేస్తున్న ఉచిత పథకాలు
- రాజకీయ పార్టీల హామీలపై సుప్రీం వ్యాఖ్యలు

## స్థానిక సంస్థలకు రేవంత్ కసరత్తు

- సీనియర్లకు ప్రాధాన్యం
- వీహెచ్‌కు కీలక పదవి?

జనతా న్యూస్, హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న సీనియర్లకు గౌరవం ఇస్తూనే తగిన పదవులు కట్టబెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. అందున స్థానిక సంస్థల ఎన్నికలు కూడా సమీపిస్తున్నందున సీనియర్లతో కలిసి ప్రయాణం చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకే మంత్రివర్గ విస్తరణ.. నామినేటెడ్ పోస్టుల పైన కాంగ్రెస్ అధి నాయకత్వం ఆచి తూచి వ్యవహరిస్తోంది.



02



### సేవాలాల్ జయంతికి రండి

ఈ నెల 15 న మహావీర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించనున్నారు. ఏటా ప్రభుత్వం అధికారికంగా దీనిని నిర్వహిస్తోంది. ఉత్సవాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క, గిరిజన సంఘాల ముఖ్య నాయకులు కలిశారు. ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## 2008 డీఎస్సీ అభ్యర్థులకు కొలువులు

- సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లుగా రెండు, మూడు రోజుల్లో నియామకం
- నెలకు రూ.31,030 చొప్పున చెల్లించనున్న సర్కారు

02







## కోళ్ల బర్డ్‌ఫ్లూపై అలర్టు

- తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం
- చికెన్ తక్కువగా తినాలని సూచనలు
- ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాల తనిఖీలు

03

## స్వల్పంగా దిగొచ్చిన బంగారం ధరలు



03

# శాస్త్రీయంగానే తెలంగాణ కులగణన

### సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం

- 16 నుంచి 28 వరకు ఎన్యూమరేటర్లకు సమాచారాం ఇవ్వాలి
- 42శాతం బిసి రిజర్వేషన్ కోసం కేబినేట్ తీర్మానం
- చట్టబద్ధత కోసం కులగణన బిల్లు కేంద్రానికి పంపుతాం
- మిడియాకు వివరించిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



03



## అసమానతల నిర్మూలనకే ఎస్సీ వర్గీకరణ

- ఇది ఎవరికో లాభం చేకూర్చే విషయం కాదు
- ప్రతి గడపకు ఎస్సీవర్గీకరణ లక్ష్యం తీసుకెళ్లాలి
- ఎస్సీ ఎమ్మెల్సీలకు మంత్రి దామోదర సూచన

## బీసీ లెక్కలన్నీ తప్పుల తడకలే

- బీసీలను అణచాలని చూస్తే ఊరుకోం
- మేధోమధన సదస్సులో తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు



02



# నోటాకు నో

మొదటి పేజీ తరువాయి

పెట్టాల? వద్దా? అనే అంశం రాజకీయ పార్టీ ల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీ ల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిపాదనలు పెట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను 'కల్పిత ఎన్నికల అభ్యర్థి'గా పరిగణించడం, పోటీ చేస్తున్న అభ్యర్థి , 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించడం. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా కంటే తక్కువ ఓట్లు పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరూ ఎన్నికైనట్లు ప్రకటించబడరు. ఎవరు ఎన్నిక కానట్లు అయితే, ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించబడుతుంది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు? తిరిగి ఎన్నికలో, నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే, తదుపరి ఎన్నికలు నిర్వహించబడవు, అత్యధిక ఓట్లు ఉన్న పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించబడుతుంది. ఈ ప్రతిపాదనలు పై రాజకీయ పార్టీ లు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని వ్యతిరేకించింది? నోటా ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్ళీ నిర్వహించాలని అంటే అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అన్నారు. ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందనీ ఆ పార్టీ పేర్కొంది. సుప్రీంకోర్టులో కేసు ఉందని మా అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని బీజేపీ అంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదనీ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వం అని స్పష్టం చేసింది. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పింది. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తె రీ ఎలక్షన్ కరెక్ట్ కాదనీ సిపిఎం చెప్పింది?.తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని టిటీడీపీ చెప్పగా సింగల్ కాండిడేట్ ఉన్నా నోటా ఉండాలన్న జనసేన పార్టీ.. చెప్పింది. రాష్ట్రంలో సర్పంచ్ పదవుల వేలంను అరికట్టడానికి కల్పిత అభ్యర్థి నిర్ణయం అని రాష్ట్ర ఎన్నికల సంఘం అంటుంది. ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు కల్పిత అభ్యర్థి విధానం ను అవలంభిస్తున్నాయని ఎన్నికల సంఘం రాజకీయ పార్టీ ల ముందు పెట్టింది.

# అసమానతల నిర్మూలనకే ఎస్సీ వర్గీకరణ

## ఎస్సీ ఎమ్మెల్సీలకు మంత్రి దామోదర

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** అణిచివేతకు గురైన కులాల్లోని అసమానతలను రూపుమాపేందుకే ఎస్సీ వర్గీకరణ అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వర్గీకరణ అనేది ఏ కులానికో, వర్గానికో వ్యతిరేకం కాదన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి గడపకూ వర్గీకరణ ఫలాలను తీసుకెళ్లే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, లక్ష్మీకాంతరావు, అడ్లూరి లక్ష్మణ్, మందుల సామెల్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తదితరులు బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రి వారికి దిశానిర్దేశర చేశారు. ఇతరులు సృష్టించే అపోహలను, అనుమానాలను నమ్మి ప్రజలు ఆందోళనకు గురికాకుండా చూసే బాధ్యత ఎమ్మెల్యేలది, మాదిగ సామాజిక వర్గ నాయకులదేనన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ మద్దతుగా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు. 2006 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో, 2024 ఆగస్ట్ ఒకటిన తీర్పు వచ్చిందని, తీర్పు వచ్చిన గంట లోపలే వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్ ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఆ వెంటనే కేబినెట్ సబ్ కమిటీ, ఆ తర్వాత వన్ మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించారన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా, జనాభా, విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక స్థితిగతులను కమిషన్ అధ్యయనం చేసిందని తెలిపారు.



అన్నిరకాల విశ్లేషణ, అధ్యయనం తర్వాత శాస్త్రీయంగా రూపొందించిన రిపోర్ట్‌ను అందించిందన్నారు. ఇది కాంగ్రెస్ కమిట్‌మెంట్ అని, సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ప్రజలకు చెప్పాలన్నారు. ప్రతి కులానికి న్యాయం చేసేలా వర్గీకరణ ఉందని మంత్రి తెలిపారు. అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ వన్‌లో, 18 కులాలను గ్రూప్2లో, కొంత మెరుగ్గా ఉన్న కులాలను గ్రూప్3లో చేర్చాలని కమిషన్ సూచించిందన్నారు. మాదిగ, మాదిగ సామాజిక వర్గాల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరుతున్న ఈ తరుణాన్ని పండుగలా జరుపుకోవాలని సూచించారు.

# స్థానిక సంస్థలకు కసరత్తు

మొదటి పేజీ తరువాయి

ఈ నెలాఖరులో తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత పైన రాహుల్ గాంధీ ఇప్పటికే సీఎం రేవంత్‌కు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వీహెచ్ కు కీలక పదవి ప్రకటనకు ముఖ్యమంత్రి సిద్దం అవుతున్నట్లు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయింది. పార్టీ సీనియర్లు ఇంకా కొందరికి ప్రాధాన్యత దక్కటం లేదు. ఈ అంశం పైన ఢిల్లీకి లేఖలు వెళ్లాయి. దీంతో, రాహుల్‌గాంధీ పార్టీ సీనియర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని రేవంత్ కు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వారికి పదవుల పైన రేవంత్ కసరత్తు చేస్తున్నారు. పార్టీ సీనియర్ నేత వీహెచ్ కు కీలక పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. వీహెచ్ పార్టీ అధికారంలోకి వచ్చిన రాజ్యసభ సీటు ఆశించారు. అవకాశం వస్తే ఖమ్మం నుంచి పార్లమెంట్ కు పోటీ చేయాలని భావించారు. కానీ, సామాజిక – క్షేత్ర స్థాయి పరిస్థితుల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. ఇప్పుడు వీహెచ్ కు కొత్త పదవి పైన కసరత్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. శాసనమండలి ఛైర్మన్ పదవి వీహెచ్ కు ఇవ్వటం పైన ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. రెండు నెలల్లో ఖాళీ కానున్న



ఎమ్మెల్యే కోటా నుంచి వీహెచ్ ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయనున్నారు. గతంలోనే వీహెచ్ కు బీసీ కమిషన్ ఛైర్మన్ గా నియమించాలని రేవంత్ భావించారు. అందుకు వీహెచ్ అంగీకరించలేదు. దీంతో, నిరంజన్ కు ఆ పదవి ఖాయమైంది. ఇప్పుడు అసెంబ్లీ స్పీకర్ గా ఎస్సీ వర్గానికి చెందిన ప్రసాద్ కుమార్ ఉన్నారు. మండలి ఛైర్మన్ గా వీహెచ్ కు ఇవ్వాలనేది తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశం పైన ఢిల్లీ స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. శాసనమండలి ఛైర్మన్ పదవితో పాటుగా వీహెచ్‌కు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జాతీయ ఛైర్మన్ గా నియమించే అంశం పైన చర్చ జరుగుతోంది. తెలంగాణలో కుల గణన తరువాత కాంగ్రెస్ పార్టీ నేతలు బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయాల పైన కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీకి తొలి నుంచి అంకిత భావంతో పని చేస్తున్న బీసీ నేతలకు పదవులు ఇవ్వాలని తాజాగా ఢిల్లీ లో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వీహెచ్ తో పాటుగా పార్టీలో పలు కీలక పదవుల ను బీసీ నేతలకు ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. పీసీసీ చీఫ్ పదవి సైతం బీసీ వర్గానికి కేటాయించిన అధినాయకత్వం.. త్వరలోనే కీలక నిర్ణయాలు ప్రకటించేందుకు సిద్దం అవుతోంది.

# 2008 డీఎస్సీ అభ్యర్థులకు కొలువులు




**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న డీఎస్సీ 2008లో నష్టపోయిన బాధితులకు మరోవారంలో కొలువులు దక్కనున్నాయి. గతంలోనే ఈ మేరకు ప్రకటన ఇచ్చనప్పటికీ దానిని రేవంత్ సర్కార్ నిలబెట్టుకోలేదు. దీంతో మరోమారు డీఎస్సీ బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే ఈసారైనా ప్రభుత్వం మాటమీద నిలబడుతుందో.. లేదో.. అన్నది వేచిచూడాల్సిందే. అసలు సంగతేమంటే.. డీఎస్సీ–2008లో నష్టపోయిన మొత్తం 1399 మంది అభ్యర్థులకు విద్యాశాఖ వారం రోజుల్లో కాంట్రాక్టు విధానంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. వారందరినీ సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లుగా నియమిస్తూ ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉమ్మడి ఏపీలో అప్పట్లో చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయంతో ఉత్తమ మార్కులు సాధించినా.. మెరిట్ జాబితాలో ఉన్నప్పటికీ బీఈడీ అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారు. దీంతో అప్పటి నుంచి తమకు న్యాయం చేయాలని వారంతా సర్కార్‌తో పోరాడుతూనే ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వారందరికీ కాంట్రాక్టు విధానంలో ఎస్జీటీ ఉద్యోగాలను మినిమం టైమ్ స్కేల్ కింద ఇవ్వాలని 2024 సెప్టెంబరు 24న నిర్ణయం తీసుకుంది. 2008 డీఎస్సీలో నష్టపోయిన వారిలో 2,367 మంది అభ్యర్థులు ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ లెక్కలు తీసింది. ఆ మేరకు వారందరికీ ధ్రువపత్రాల పరిశీలన కూడా చేశారు. రేవంత్ సర్కార్ ఆదేశాల మేరకు వీరందరికి కాంట్రాక్టు విధానంలో ఉపాధ్యాయ ఉద్యోగాలిచ్చేందుకు అధికారులు కూడా ఏర్పాట్లు చేశారు. మరో వారం రోజుల్లో వారికి నియామకపత్రాలు అందజేస్తామని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు గత ఏడాది నవంబర్‌లో ఈవీ నరసింహారెడ్డి ప్రకటించారు కూడా. వీరికి వేతనం కింద నెలకు రూ.31,030 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. కానీ ఆ తర్వాత అతీగతీ లేకుండా పోయింది. మళ్లీ దాదాపు రెండు నెలల తర్వాత ఆ ప్రస్తావన మళ్లీ తెరపైకి వచ్చింది. తాజాగా డీఎస్సీ బాధితులందరి ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని, కాంట్రాక్టు విధానంలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)గా పని చేస్తామంటూ ధ్రువీకరించాలని విద్యాశాఖ కోరింది. ఇందుకు 1382 మంది అంగీకరించారు. నియామక పత్రాల అందజేతకు సీఎం రేవంత్‌రెడ్డి నెల రోజుల క్రితమే ఆమోదం తెలిపారు. అయితే కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. ఉద్యోగాలు ఇవ్వడంపై జాప్యం నెలకొంది. తాజాగా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చేందుకు ఎట్టకేలకు సిద్ధమైంది.

# బీసీ లెక్కలన్నీ తప్పుల తడకలే

## మేధోమధన సదస్సులో తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** ఎవరైనా బీసీ జాతుల గొంతు మీద కాలు పెడతామని అంటే ఊరుకోం బిడ్డా.. మీ అంతు చూస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు చేశారు. బంజారాహిల్స్ కళింగభవన్‌లో తెలంగాణ ప్రభుత్వ కులగణన సర్వే రిజర్వేషన్ల పూర్వాపరాలు, సమస్యలు, ఆందోళనకర అంశాలు, పరిష్కార మార్గాలు అంశంపై బుధవారం మేధోమధన సదస్సు నిర్వహించారు. –పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ అల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు తీన్మార్ మల్లన్న హాజరై ప్రసంగించారు. మనం ఇప్పటి వరకు కులగణనలోని లోపాలను సమాజం ముందు పెట్టినం.. ప్రభుత్వం చేసిన బీసీ లెక్కలు తప్పు అనడానికి అనేక విధాలుగా ప్రజల ముందు ఉంచామన్నారు. ప్రభుత్వం బీసీ లెక్కల తప్పిదాలను ఎప్పుడు సరిచేస్తదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల ఆర్థిక పరమైన లెక్కలు కూడా బయటికి రావాలని.. 2 లక్షల 91 వేల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు సగం రావాల్సిందేనన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి కూడా బీసీలపై జరిగిన ఆర్థిక దోపిడి అంశాన్ని చర్చకు తీసుకోవాలని.. బీసీలకు జరిగిన అన్యాయన్ని అన్ని రంగాల్లో లెక్కలు తీస్కొని ప్రజలకు వివరించాలని కోరారు. బీసీలకు సీట్లు పార్టీలు వేసే బిచ్చమ్ అని.. అదే రిజర్వేషన్స్ మాత్రం రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలనే గెలిపించాలి.. ఆ దిశగా మనం ప్రణాళిక రచించాలి.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైండ్ బ్లాక్ అయ్యే రిజల్ట్స్ ఉండాలని బీసీలకు మల్లన్న పిలుపునిచ్చారు. బీసీల కోసం గొంతెత్తి నాకు పార్టీ నోటీసులు ఇస్తే.. ఈ సభ నాకు మద్దతుగా నిలిచిందని ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్స్ సాధించడమే మా అందరి అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పుడున్నది గత తెలంగాణ కాదు.. ఎడ్డి తెలంగాణ కాదు.. చైతన్యం ఉన్న తెలంగాణ.. బీసీలు చైత్యంతో ఉన్నారని అన్నారు. జిల్లా, గ్రామీణ ప్రాంతంలో బీసీలు చర్చ పెట్టాలని.. తీన్మార్ మల్లన్న టీంలో ఆధ్వర్యంలో కొన్ని గ్రామాల్లో జనాభా లెక్కలు తీస్తామని.. ఆ లెక్కలను గ్రామ పంచాయతీ దగ్గర అతికిస్తామని పేర్కొన్నారు.



# ఉచితంగా డబ్బులొస్తే పని చేస్తారా?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** ఉచిత పథకాలతో ప్రజల్లో కష్టపడే తత్వం పోతోందని, వారు పనులకు దూరంగా ఉంటున్నారని, రాజకీయ పార్టీల ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్ట వశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలి. ఉచితాల ద్వారా అలా జరుగుతోందా..?ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదు' అని జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే పనిలో ఉందని.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించేందుకు యోచిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈసందర్భంగా ధర్మాసనానికి తెలిపారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌ను మరో ఆరు వారాల తర్వాత విచారిస్తామని వాయిదా వేసింది.

# ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు నివాళి



మొదటి పేజీ తరువాయి

జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో మాక్రాన్‌తో కలిసి సదస్సుకు మోద అధ్యక్షత వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. రెండో దఫా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆదేశంలో మోదీ పర్యటించనుండటం ఇదే ప్రథమం.

# కోళ్ల బర్డ్‌ఫ్లూపై అధికారుల అలర్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోళ్ళకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి మ–రణిస్తుండటంతో తెలంగాణ అధికారులు అలెర్ట్ అయ్యారు. తెలంగాణా ప్రజలు చికెన్ తక్కువగా తినాలని, అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అయితే తెలంగాణాలో బర్డ్ ఫ్లూ లేదని, ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు సైతం చెప్తున్నారు. అయినప్పటికీ పలు జాగ్రత్తలు తీసుకుంటున్న తెలంగాణా ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ఆంధ్ర నుండి తెలంగాణకు వచ్చే సరిహద్దుల్లో తనిఖీలు పెంచింది. కోదాడ మండలం రామాపురం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ కొనసాగుతుంది. ఈ నెల 7తారీకు నుండి రాష్ట్ర బార్డర్ చెక్ పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి బర్డ్ ఫ్లూ లేకపోయినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వ్యాధి వ్యాప్తించకుండ చర్యలు తీసుకుంటున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులు కోళ్ళ ఫారాలను సందర్శించి రైతులకు సూచనలు చేస్తున్నారు. దాణా తెచ్చే వాహనాలు సైతం శానిటైజ్ చేసి కోళ్ళ ఫారాలకు అనుమతించాలని, శానిటైజ్ చెయ్యకుంటే ఇబ్బంది వస్తుందని అంటున్నారు.ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాలేదని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి వెల్లడించారు. ఇప్పటివరకు అందిన వివరాల ప్రకారం ఇతర కారణాలతో కోళ్లు మరణించినట్టు ఆయన పేర్కొన్నారు. చికెన్ తినొచ్చా? అధికారులు చెప్తుందిదే తెలంగాణ రాష్ట్రంలో చికెన్ తినడం వల్ల ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో చికెన్ తినకూడదని తప్పుడు ప్రచారం జరుగుతుందని, ఆ ప్రచారాన్ని నమ్మవద్దని వెల్లడించారు.వరంగల్, ఖమ్మం జిల్లాలో కోళ్ల మృతి పైన రక్త నమూనాలను ల్యాబ్ కు పంపించామని, అవి ఇతర కారణాలతో మృతి చెందినట్లు తేలిందని ఆయన అన్నారు బర్డ్ ఫ్లూ పై పౌల్ట్రీ రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు.

# మోడీ విమానాన్ని పేల్చేస్తాం

**ముంబై, నవంబర్ 12:** విదేశీ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణిస్తున్న విమానానికి ఉగ్ర బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. మోదీ విమానాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడి జరగొచ్చని తమకు సమాచారం వచ్చినట్లు ముంబయి పోలీసులు వెల్లడించారు.'ఫిబ్రవరి 11న ముంబయి పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. విదేశీ పర్యటనలో ఉన్న మోదీ విమానంపై ఉగ్రవాదులు దాడి జరగొచ్చు అని అవతలి వ్యక్తి బెదిరించారు. సమాచారంలో ఉన్న తీవ్రత దృష్ట్యా మేం వెంటనే ఇతర దర్యాప్తు సంస్థలను అప్రమత్తం చేశాం. కాల్ చేసిన వ్యక్తి ఎవరనే దానిపై దర్యాప్తు చేపట్టాం' అని ముంబయి పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం ఫోన్ కాల్ చేసిన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ సోమవారం నాలుగు రోజుల విదేశీ పర్యటనకు బయల్దేరారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో ఉన్న ఆయన కృత్రిమ మేధ కార్యాచరణ సదస్సులో పాల్గొన్నారు. పారిస్ పర్యటనను ముగించుకొని నేడు అమెరికా బయల్దేరనున్నారు. రెండు రోజుల పాటు అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు. ఈసందర్భంగా అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్నారు.

# స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం

- న్యాయపరమైన చిక్కులు రాకుండా చర్యలు
- రిజర్వేషన్లపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- మిగిలిన వారి కోసం మ-రోమారు కులగణన

**హైదరాబాద్,ఫిబ్రవరి12 :** తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కానరావడం లేదు. ఓ వైపు సమీక్షలు చేస్తుంటే..మరోవైపు మళ్లీ కులగణకు అవకాశం ఇవ్వండతో అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ఆసల్యం తప్పదన్న భావన కూడా ఉంది. ఈనెల 15వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని భావించారు. కానీ, స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోసారి కులగణన సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు అవకాశం కల్పించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని స్పష్టం చేసింది. దీంతో రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందాకే ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం అంటే3.50 కోట్ల మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం అంటే 16లక్షల మంది వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు. అయితే ఈ లెక్కల ఆధారంగానే పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను వెంట వెంటనే నిర్వహించనుందని సమాచారం. ఎన్నికలకు సన్నద్ధతపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల కమిషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాను సైతం ఈసీ ఇటీవలే ప్రకటించింది.



ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్ పెట్టే అవకాశం ఉంది. తాజాగా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పంచాయతీ ఎన్నికలపై సీఎస్ శాంతి కుమారి, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చిన వెంటనే షెడ్యూల్ రిలీజయ్యే అవకాశం ఉంది. 42శాతం సీట్లు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో పాత పద్ధతినే అమలు చేస్తారని తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు యాభైశాతం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలను సమావేశపర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అది సాధ్యం కాదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఒక అడుగు ముందుకు వేసింది. తమ పార్టీ 42శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఇటీవలే రైతు భరోసా మొత్తాన్ని కర్షకుల ఖాతాల్లో జమ చేసింది. బీసీ కులగణన చేపట్టి 56 శాతం వెనుకబడిన వర్గాల వారున్నారని తేల్చింది. వారికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులున్న దృష్ట్యా పార్టీగా ప్రకటిస్తామని వివరించింది. ముందుగా పార్టీ గుర్తుతో సంబంధం లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏక గ్రీవాలు అధికంగా చేయడం ద్వారా మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకోవాలని భావించింది. ఈసీ నోటా అంశాన్ని తెరమీదకు తేవడంతో కొంత ఇబ్బంది పడ్డ కాంగ్రెస్.. ఇవాళ నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఒకే అభ్యర్థి బరిలో ఉంటే నోటాతో పోటీ పెట్టే అంశాన్ని వ్యతిరేకించింది. గెలిచిన సర్పంచులు.. అభివృద్ధి కోసం తమ పార్టీలో చేరుతారని భావిస్తోంది. వారిని చేర్చుకొని వాళ్ల అండతో ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమయ్యే అవకాశ ఉంది. ఇలా చేయడం ద్వారా మెజార్టీ మండలాల్లో పాగా వేయొచ్చన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బీసీలకు కొంచం తక్కువ 23 శాతం సీట్లను కేటాయించనుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు 28శాతం స్థానాలను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై న్యాయ సమీక్ష జరిగిన తర్వాత ఎలాంటి ఆటంకాలు రావని నిర్ధారించుకున్న మీదటే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

# శాస్త్రీయంగానే తెలంగాణ కులగణన

- సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం
- 16 నుంచి 28 వరకు ఎన్యూమరేటర్లకు సమాచారాం ఇవ్వాలి
- 42శాతం బిసి రిజర్వేషన్ కోసం కేబినేట్ తీర్మానం
- చట్టబద్ధత కోసం కులగణన బిల్లు కేంద్రానికి పంపుతాం
- మీడియాకు వివరించిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,ఫిబ్రవరి12 :** తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. వివిధ కారణాల వల్ల కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 16 నుంచి 28 వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలని సూచించారు. రాష్ట్ర జనాభా లెక్కల్లోకి వచ్చే విధంగా అందరూ చూసుకోవాలని కోరారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మార్చి మొదటి వారంలో కేబినెట్ తీర్మానం చేయనుంది. శాసనసభలో బిల్లు ఆమోదం చేసి చట్టబద్ధం చేయాలని నిర్ణయించాం. కులగణన బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదానికి కృషి చేస్తాం. ఓబీసీల రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నాయకులను కలుస్తాం. దశాబ్దాల ఓబీసీల కలలను నిజం చేసేందుకు కృషి చేస్తాం. రిజర్వేషన్లపై రాజకీయపరంగా కుట్రలు చేస్తే తిప్పి కొడతాం. రాజకీయ లబ్ధి పక్కన పెట్టి మద్దతు పలకాలని కోరుతున్నాం' అని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే సహేతుకంగా, స్పష్టంగా చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే పై అసెంబ్లీలో లెక్కలతో సహా సీఎం సభ దృష్టికి తెచ్చారని, అసెంబ్లీలో చర్చ సందర్భంగా అనేక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సలహాలు సూచనలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే సహేతుకంగా, స్పష్టంగా చేశామని ఆయన పేర్కొన్నారు. 3.1శాతం మంది మాత్రమే ఇంటి యజమానులు సర్వేలో పాల్గొనలేదన్నారు. కొద్దిమంది ఇంటికి తాళాలు వేసి వెళ్లారని ఆయన తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి వాళ్ళు ఉద్దేశపూర్వకంగా సర్వేకు రాలేదని, సర్వేలో పాల్గొని వారి కోసం మరోసారి కుటుంబ సర్వేకు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మరో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. టోల్ ఫ్రీ ద్వారా కూడా సమాచారాన్ని ఇస్తే ఎన్యుమరేటర్లు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని భట్టి విక్రమార్క తెలిపారు. మండల కేంద్రాల్లో రాష్ట్ర జనాభా లెక్కల్లోకి రావాలని అందర్నీ కోరుతున్నామన్నారు. అంతేకాకుండా.. 'లెక్కల్లోకి వచ్చి జన జీవన స్రవంతిలో కలవాలని కేసీఆర్ లాంటి వాళ్ళను కోరుతున్నాను. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు వివరాల నమోదు పూర్తి చేసి? లెక్కలన్నీ క్యాబినెట్ లో పెట్టి బీసీలకి 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. మార్చి మొదటి వారంలో క్యాబినెట్ లో పెట్టి తర్వాత అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేస్తాం. .ఈ బిల్లును కేంద్రానికి పంపి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం. పార్లమెంటులో కూడా ఈ బిల్ పెట్టి ఆమోదించేలా రాహుల్ గాంధీని, ప్రధానిని, అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి వారి మద్దతు కూడా గడతాం. దశాబ్దాల బిసిల కల నెరవేర్చుతాం. కలసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను తీసుకుని ఢిల్లీ వెళతాం. స్థానిక సంస్థల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేస్తాం. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం మేం చేసే కార్యక్రమానికి మద్దతు పలకాలని కోరుతున్నాం. ప్రగతిశీల భావజాలలు ఉన్న అందరు కలిసి రావాలి.' అని భట్టి విక్రమార్క అన్నారు.

## కేసులను తప్పదోవ పట్టించే యత్నం

### ఆరోపణలు, ఎదురుదాడులతో బిఆర్ఎస్ డ్రామా

**హైదరాబాద్, నవంబర్ 12:** మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు బిఆర్ఎస్ అన్ని వర్గాలకు ప్రాతనిధ్య పార్టీగా ప్రచారం చేసుకుంటోంది. రైతులపట్ల ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తోంది. వారి సమస్యలపై జిల్లాల వారీగా పోరాటాలు చేస్తోంది. ధర్నాలు చేస్తోం ది. హాస్టళ్లలో పురుగుల అన్నం అని గగ్గోలు పెడుతోం ది. బిసిలకు కాంగ్రెస్ ద్రోహంచేస్తోందని అంటోంది. జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని అంటోంది. గ్రామీణ వైద్యులకు అన్యాయం జరిగిపోయిందని వారి ధర్నలకు మద్దతు ప్రకటించింది. ఇలా చెప్పుకుం టూ పోతే తెలంగాణలో సకల సమస్యలన్నీ కాంగ్రెస్ వల్లనే పుట్టుకు వచ్చాయని ప్రచారం చేసి, ఆయా వర్గాలను దువ్వే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గతంలో ప్రజల్లోకిరాకుండా, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా, తొమ్మదిన్నరేళ్లు నిరంకుశంగా పాలించిన బిఆర్ఎస్ ఇప్పుడు చిలకపలుకులతో బయలుదేరింది. ఓవైపు తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ ఏడాది రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని వలపోస్తున్నారు. అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదిరాల్లో అవినీతి గుప్పుమంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపి స్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరించారు. తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయి నా ఢిల్లీ వస్తామని అన్నారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకనో బిఆర్ఎస్ దూరంగా ఉంది. ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేందుకు అవకాశం ఉందని అంటున్నారు. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. అయనపై ఎసిబి విచారణ సాగుతోంది. మొత్తంగా అవినీతి కేసుల్లో బిఆర్ఎస్ నేతలు బయటపడతారా లేక విచారణతో కాలయాపన చేస్తారా అన్నది చూడాలి.



## మాఘ పౌర్ణమితో కుంభమేళాలో పుణ్యస్నానాలు

### లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

**ప్రయాగరాజ్, నవంబర్ 12:** మాఘ పూర్ణిమ సందర్భంగా మహా కుంభమేళాకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి దాదాపు కోటిమంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఇంకా లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. పౌర్ణమి ప్రత్యేక మైన రోజు కావడంతో లక్షలాదిగా తరలివచ్చారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యూపీ ప్రభుత్వం అప్రమత్తం అయింది. కట్టుదిట్టమైన భద్రత కల్పించింది. ఇంకోవైపు యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ స్వయంగా పరిస్థితుల్ని సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన దుర్ఘటనలు తిరిగి జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎక్కడికక్కడే పోలీసులు మోహరింపజేశారు. ఇదిలా ఉంటే ప్రయాగ్‌రాజ్‌లో ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాగున్నాయంటూ కితాబు ఇస్తున్నారు. మహా కుంభమేళా ఫిబ్రవరి 26 మహాశివరాత్రి వరకు కొనసాగనుంది.



## కులాల కుంపట్లో చలికాచుకుంటున్న రాజకీయ పార్టీలు!

ఏ రోజుకు ఏది అవసరమో అది మాట్లాడడం..ఆయా వర్గాలను ఆకట్టుకునేలా చెప్పడం రాజకీయ పార్టీలకు షరా మామూలు అయ్యింది. దేశంలో బడుగు,బలహీన వర్గాలతో పాటు, నిమ్న వర్గాలను దువ్వడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. తాజాగా ఇప్పుడు ఎస్సీవర్గీకరణ, బిసి కులగణన వ్యవహారం నడుస్తోంది. ఈ రెండు వర్గాలను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీలు జెండాలెత్తుకున్నాయి. తామే వారికి రక్షణ కవచమని, వారి అభ్యున్నతే తమ రాజకీయం అని చెబుతున్నాయి. తెలంగాణలో బిసి కులగణన సరిగా జరగలేదని బిజెపి, బిఆర్ఎస్ వాదిస్తున్నాయి. పక్కా ప్రణాళికతో చేపట్టామని కాంగ్రెస్ చెబుతోంది. ఎవరు కరెక్ట్..ఎవరు రాంగ్ అన్నది ఆయా వర్గాల ప్రజలు విశ్లేషించుకుంటున్నారు. నిజానికి ఏ పార్టీ కూడా ఈ కులాలకు పెద్దపీట వేయడంలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా దళితుడైన మల్లికార్జున ఖర్గే ఎన్నికైనా అది పేరుకు మాత్రమే. పెత్తనం, వ్యవహారమంతా రాహుల్, సోనియా, ప్రియాంకల గుప్పిట్లో ఉంది. అదో కుటుంబ పార్టీగా మారింది. బిఆర్ఎస్‌లో అయితే పక్కా కుటుంబ పార్టీయే. టిడిపి కూడా మరీ కుటుంబ పార్టీ అనక తప్పదు. వీరంతా ఇప్పుడు కులాల ఉద్ధరణకు వీరతాళ్లు వేసుకున్నారు. బిసిలపై కాంగ్రెస్‌కు ప్రేమలేదని, వారిని మోసం చేశారని తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్‌లు అంటున్నాయి. అందుకే ఇప్పుడు బిజెపి కూడా బిసి అధ్యక్షుడిని చేస్తుందన్న ప్రచారం ఉంది. కాంగ్రెస్ ఇప్పటికే బిసిని అధ్యక్షుడిగా చేసేసింది. బిఆర్ఎస్‌లో ఆ ఛాన్స్ లేదు. అక్కడ వెలమదొరలు తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. టిడిపిలో చంద్రబాబు కుటుంబం తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. ఇలా పార్టీల్లోనే న్యాయంచేయలేని వారు ఎస్సీ, బిసిలకు న్యాయం చేస్తామంటే నమ్మడం ఎలా అన్నదే సమస్య. దేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సమాఖ్యలు అన్నీ అగ్రవర్ణాల నాయకత్వంలోనే నడుస్తున్నాయి. కమ్యూనిస్టుల్లో కూడా అగ్రకులాలదే పెత్తనం అని వేరుగా చెప్పనక్కరలేదు.

తమ గుప్పిట్లో అధికారం ఉండాలి...కానీ తమ మాత్రం కింది కులాల వారికి అండగా ఉన్నామని చెప్పుకోవాలన్న తలబిరుసుతనంతో ఆయా పార్టీల నేతలు ఉన్నారు. అందుకే పార్టీ నాయకత్వ మైనా, అధికార పెద్దరికమైనా చేజారిపోకుండా జాగ్రత్త పడుతూనే ఉంటారు. ఇప్పటికీ తక్కువ కులాల్లో జాతి వివక్ష కొనసాగుతోంది. దీనిని తొలగించి వారిని సమాజాంలో అందరితో సమానంగా చేయడానికి ప్రయత్నాలు సాగడం లేదు. అంతెందుకు కులవ్యవస్థ నిర్మూలనకు ఎవ్వరూ పోరాడడం లేదు. కులాల పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అలవాటు పడ్డ వీరు కలుఆలను సజీవంగా కొనసాగించేలా చేస్తున్నారు. బడుగువర్గాల, శ్రమజీవుల ప్రతినిధులమని చెప్పుకొనే పార్టీల్లో కూడా ఈ జాడ్యం కొనసాగడం దారుణం. మరోవైపు అగ్రకుల అధిపత్యానికి విరుద్ధంగా..పాలనలో తమ వాటా, భాగస్వామ్యం కోసం దేశంలోని బిసిలు, దళితులు గట్టిగా పోరాడలేక పోతున్నాయి. కాన్షీరామ్ బిఎస్‌పి స్థాపించి సంచలనం సృష్టించినా, అధికార యావలో ఆ పార్టీ కొట్టుకుపోయింది. అంతెందుకు తెలంగాణలో దళిత ఉద్ధరణ అంటూ బయలుదేరి బిఎస్‌పిలో చేరిన ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా అధికార యావలో బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పిన ఆయన చివరకు అదేపార్టీ చంకనెక్కారు. అంటే ఏదో ఒక డబ్బున్న పార్టీలో చేరితే తప్ప మనుగడ లేదని ఆయన గుర్తించివుంటారు. నిజానికి బిసిలు సమగ్ర కులగణన కోరుతున్నారు. మాదిగలు ఎస్‌సి రిజర్వేషన్లలో తమ వాటా తేల్చమంటున్నారు. తాజాగా ఎబిసిడి వర్గీకరణ జరగాలని మందకృష్ణమాదిగ కోరుతున్నారు. వీరి డిమాండ్లు క్రమంగా రాజకీయ ప్రాధాన్యతను పొందాయి. గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు వీటి ప్రస్తావన తేక తప్పలేదు. తాజాగా ఇప్పుడు పంచాయితీ ఎన్నికలు రావడంతో అన్నిరాజకీయ పార్టీలు బిసిలకు తామే ప్రతినిధులం అన్నట్లుగా బయలుదేరాయి. తొమ్మిదన్నరేళ్లు అన్ని వర్గాలను అణగదొక్కి, తెలంగాణ పేరు చెప్పి దోచకున్న బిఆర్ఎస్ నేతలుకూడా బిసిలపట్ల ఎక్కడ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో గెలిపిస్తే దేశంలో బిసిల కులగణన చేపడతామని రాహుల్ గాంధీ చెబుతూ వచ్చారు. ఎస్‌సి రిజర్వేషన్లలో మాదిగలకు న్యాయం చేస్తామని భరోసా ఇస్తూ ప్రధాని మోడీ ఎన్నికల ప్రచార వేదికపై మందకృష్ణ మాదిగ కన్నీళ్లు తుడిచారు. నిజం ఏమిటంటే ఈ రెండు సమస్యలు రాజకీయ క్షేత్రంలో పావులుగా వాడుకోవడానికి అన్ని పార్టీలకు ఉపయోగపడుతున్నాయి. ఏ ప్రధాన రాజకీయ పార్టీకి వీరి డిమాండ్ల పట్ల చిత్తశుద్ధి లేదనడంలో సందేహం లేదు. తమ రాజకీయ నిచ్చెనను ఎక్కడానికి వీరు మెట్లుగా ఉపయోగపడతారు కాబట్టి వారి గురించి మాట్లాడుతున్నారు. వారి సమస్యలను అధ్యయనం చేసి, వారి ఆకాంక్షలను నెరవేర్చి ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడాలన్న ఆసక్తి ఏ రాజకీయపార్టీకి లేదనే చెప్పాలి. పైగా వారిని ఎదగకుండా చేసి, ఉన్నచోటనే ఉంచి అవసరానుగుణంగా వాడుకోవాలన్న రాజకీయ దురుద్దేశం కూడా ఆయా పార్టీ నేతలకుంది. దేశంలోని బిసిలు, మాదిగలు కోరుకుంటున్న విధంగా విధాన కల్పన చేయాలనీ ఏ ప్రభుత్వానికి లేదు. కింది కులాలు ఎదిగి తమ పీఠాలు కదిలించకుండా సకల జాగ్రత్తలు ఆ నాయకులు తీసుకుంటారు. నిజానికి దేశం అభివృద్దిలో పయనించాలంటే పేద, ధనిక వర్గాలను గుర్తించి వారికి పథకాలు అందచేయాలి. దళిత,బిసి వర్గాలను గుర్తించి వారి ఆర్థిక స్థోమత ఆధారంగా పతకాలు రచించాలి. విద్య,ఉద్యోగ రంగాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయంగా వారిని భాగస్వాములను చేయాలి. కులనిర్మూలన చేసి భారతజాతిని ఏకంచేయాలి. అలాచేసే ధైర్మం ఉందా అన్నది చెప్పాలి. కులాల కుంపట్లు రాజేసి రాజకీయ లబ్ధి పొందే రాజకీయ స్వార్థ పరుల పట్ల ఆయా కులాల వారు జాగ్రత్తగా ఉండడం ఎప్పటికీ అసరం.

# ఇంత వరకు హొంగార్డులకు జీతాలు ఇవ్వకపోడం సిగ్గుచేటు

**సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** చిన్నజీతాలతో జీవితాలు నెట్టుకొచ్చే వారికి 12 రోజులు గడుస్తున్నా జీతాలు ఇవ్వకపోవడం దారుణమని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 16వేలకు పైగా ఉన్న హొంగార్డులకు 12 రోజులు గడుస్తున్నా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని అన్నారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హొంగార్డులు చేతిలో చిల్లిగవ్వలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఈఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న పరిస్థితి ఉందని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని ధ్వజమెత్తారు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు పెడుతున్నారని విమర్శించారు. ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన అని ఆక్షేపించారు. హొంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# జీహెచ్‌ఎంసీ కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించింది : కోదండరామ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** జీహెచ్‌ఎంసీ కార్మికులు చేస్తున్న సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జనసమితి మద్దతు ఇచ్చిన ఐఎన్‌టీయూసీ అనుబంధ మునిసిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జరిగిన జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, సత్యజిత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి శివకుమార్, టీజేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ, జీహెచ్‌ఎంసీ కార్మిక యూనియన్ నాయకులతో కలిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు చెందిన పలువురు ఉద్యోగులు, కార్మికులు సంజీవరెడ్డి సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జోనల్ ప్రెసిడెంట్ శివకుమార్, కార్యదర్శి శరణ్‌జిత్‌సింగ్, నాయకులు శివరాజ్, మహేష్, నరసింహ, యాదగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టుకు పుష్పక్ సర్వీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. మరిన్ని పుష్పక్ సర్వీసులను నడపనున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని బస్సులు సర్వీసులందిస్తుండగా.. మరో 6 సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సులు సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మీదుగా రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. మొత్తం ఆ బస్సులు 24 ట్రిప్పులు నడుపుతున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రాణిగంజ్, సెక్రటేరియట్, రవీంద్రభారతి, హజ్‌హౌజ్, నాంపల్లి, గాంధీభవన్, ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్, బహదూర్‌పుర, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.55 గంటలకు చివరి బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.50 గంటలకు చివరి బస్సు బయల్దేరుతుందని అన్నారు. ప్రయాణికులు ఈ విషయాలను గమనించాలన్నారు. కాగా, పుష్పక్ బస్సుల నడుపుతుండటంతో ప్రయాణికులకు టెన్షన్ తీరనుంది. ప్రస్తుతం పలువురు ఎక్కువ డబ్బులు చెల్లించి క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్తుండగా.. ఇప్పుడు ఆ తిప్పలు తప్పనున్నాయి. అధికారుల తనిఖీలతో నిలిచిన బస్సులుఇక హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలకు భయపడి ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను డ్రైవర్లు వనస్థలిపురంలోనే నిలిపివేశారు. రవాణాశాఖ అధికారుల తనిఖీలు పూర్తయ్యే వరకు బస్సులను సిటీలోకి తీసుకెళ్లబోమని డ్రైవర్లు ప్రయాణికులకు తెగేసి చెప్పారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ట్రావెల్స్ కాల్ సెంటర్లకి కాల్ చేసి మాట్లాడితే వారు నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైనా పత్రాలు లేకుండా రోడ్లపై బస్సులు ఎలా నడుపుతున్నారని డ్రైవర్లను నిలదీశారు. బస్సుల్లో వృద్ధులు, చంటి పిల్లలు ఉన్నారని.. తాము వెళ్లాల్సిన చోటుకు తీసుకెళ్లకుండా ఇక్కడే గంటలకొద్ది నిలిపేయటం ఏంటని మండిపడ్డారు. డ్రైవర్, కాల్ సెంటర్ల నుంచి సరైన స్పందన రాకపోవటంతో కొందరు క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్లిపోయారు.



# బలంగా ఉన్నచోటే పోటీ చేస్తాం

- మిగిలిన చోట్ల కాంగ్రెస్‌తో పనిచేస్తాం
- కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా ఉన్న చోట పోటీ చేస్తామని.. మిగతా చోట్ల కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీతో కలుపుకుపోతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కలిసి వస్తే ముందుకు వెళ్తామన్నారు. ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామని.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీల అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై చర్చిస్తున్నట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేయడాన్ని తాను స్వాగతిస్తున్నామని తెలిపిన కూనంనేని.. రాష్ట్ర ప్రభుత్వం మొండి పోకడకు వెళ్లకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులను ఎన్ కౌంటర్ పేరుతో అత్యంత దారుణంగా చంపేస్తున్నారని.. దీనిపై న్యాయ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులను కలుపుకోవడంలో వైఫల్యం చెందిందని కూనంనేని చెప్పుకొచ్చారు. సమన్వయం చేసుకోవడంలో ఫెయిలైందని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టు పార్టీల కలయికతోనే విజయం సాధించిందన్న విషయాన్ని హస్తం పార్టీ మర్చిపోతుందంటూ సున్నితంగానే చురకలంటించారు. దేశవ్యాప్తంగా అనేక పరిణామాలు చూస్తున్నారు కానీ.. కలుపుకోవడం తెలియడం లేదన్నారు. కులగణన సర్వే రిపోర్టును రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంగా ప్రకటించిందని.. అందుకు సంతోషం వ్యక్తం చేశారు కూనంనేని. అయితే.. అందులో బీసీలు తగ్గారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని.. గ్రామ సభల్లో ఈ అంశంపై చర్చ పెట్టాలన్నారు. ఎస్సీ కులగణనలో చిన్న చిన్న లోపాలున్నాయని తెలిపిన కూనంనేని.. వాటిని రీ వెరిఫై చేయాలన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె దిశగా ఆలోచనలు చేస్తున్నారని.. వాళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలం ఉన్నచోట పోటీ చేస్తామన్న కూనంనేని.. కుదిరిన చోట కాంగ్రెస్ పార్టీతో కలుపుకుపోతామని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామని తెలిపుతున్నామని తెలిపారు. టీచర్ ఎమ్మెల్సీలకు ఇంకా చర్చలు సాగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేసినవి చెప్పుకోవడం చేత కావడం లేదని కూనంనేని చెప్పుకొచ్చారు. రూ.22 వేల కోట్ల రుణమాఫీ చేసినా కూడా చెప్పుకోవడం లేదన్నారు. అయితే.. 2 లక్షల మేర రుణమాఫీ విషయంలో ప్రభుత్వం కొంత వైఫల్యం చెందిందని కూనంనేని అభిప్రాయపడ్డారు. కొన్ని అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తుందని తెలిపారు. అన్నదాతల అకౌంట్లలో రైతు భరోసా కూడా వేస్తున్నారని చెప్పుకొచ్చారు. మోడల్ విలేజీల్లో ఇల్లు కూడా కట్టిస్తున్నారని.. కానీ చేసినవి చెప్పుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అయింది. ప్రభుత్వంలో ఎవ్వరు ఫోన్ కాల్స్ అటెండ్ చెయ్యడం లేదని.. ప్రభుత్వం దీన్ని గమనించాలంటటూ కూనంనేని సాంబశివ రావు షాకింగ్ కామెంట్స్ చేశారు. మరోవైపు.. మావోయిస్టులను అంతం చేసేందుకు మార్చి నెలలో ముహూర్తం పెట్టారన్న విషయాన్ని గుర్తు చేసిన కూనంనేని.. ముహూర్తాలు ఎవరు పెడతారు.. ఎందుకు పెడుతారంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగాన్ని కాలరాసే విధంగా మావోయిస్టులను మట్టుపెట్టడానికి ముహూర్తాలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సంఘవిద్రోహులేమో అసెంబ్లీలో, పార్లమెంట్లో ఉంటారు.. ప్రజలకోసం పనిచేసే మావోయిస్టులను చంపేస్తారా అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా హత్యలు చేస్తున్నట్టేనని.. అతనిపై విచారణ చేయాలని కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు.

# నార్సింగ్ డిఐ శ్రీనివాస్‌పై చర్యలు

**ఐజి కార్యాలయానికి అటాచ్డ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** నార్సింగ్ డిఐ (డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్) శ్రీనివాస్‌ను సైబరాబాద్ సీపీ ఐజి కార్యాలయానికి అటాచ్ చేశారు. లావణ్యతో తరచూ వాట్సాప్‌లో వీడియో కాల్స్ మాట్లాడుతూ శ్రీనివాస్ పరిచయం పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరి ఆడియో కాల్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపారు. విచారణలో డిఐ శ్రీనివాస్ లావణ్యతో మాట్లాడింది నిజమే అని తేలడంతో అతనిని ఐజి ఆఫీసుకు అటాచ్ చేశారు.. లావణ్య నటుడు రాజ్ తరుణ్‌పై ఫిర్యాదు చేసినప్పటి నుంచి శ్రీనివాస్‌తో ఆమె పరిచయం పెరిగింది. తరచూ ఇద్దరూ ఫోన్లో వీడియో కాల్స్.. ఆడియో కాల్స్ మాట్లాడుతున్నారు. అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో సైబరాబాద్ సీపీ శ్రీనివాస్‌పై ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

# గాంధీ ఆస్పత్రికి రోడ్డు ప్రమాద మృతుల బాడీలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా నుంచి తిరిగొస్తుండగా మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు యాత్రికులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలను రెండు అంబులెన్సుల్లో జబల్‌పూర్ నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పోలీసులు, డీఎంహెచ్‌వో, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మల్లారెడ్డి, సంతోష్, శశికాంత్, రవి, రాజు మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి నాచారం నుంచి వచ్చిన వారి కుటుంబసభ్యులకు అప్పగించగా.. బ్యాంక్ మేనేజర్ టీవీ ప్రసాద్ మృతదేహాన్ని తార్నాకలోని గోకుల్‌నగర్‌లో ఉండే ఆయన కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


# ఆందోళన బాటలో ఆటో డ్రైవర్లు

- హామీల అమలుకు డిమాండ్



**హైదరాబాద్,ఫిబ్రవరి12 :** ఆటో డ్రైవర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ ఆటో డ్రైవర్స్ ఐకాస ఆందోళనకు సిద్ధమవుతోంది. ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనల కార్యక్రమాలతో పాటు 24న అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర స్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తామని ఐకాస కన్వీనర్ వెంకటేశం తెలిపారు. ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. సమస్యలపై సమ్మెకు పిలుపునిస్తే.. ఇంటికి పిలిపించి చర్చించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నాలుగు నెలలు గడుస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.12వేలు ఇస్తామని ఇప్పటికీ ఆ పథకం అమలు చేయలేదన్నారు. మరో వైపు మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. బ్జడెట్ సమయంలో ఆటో కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# స్వల్పంగా దిగొచ్చిన బంగారం



**న్యూఢిల్లీ, నవంబర్ 12:** గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు బుధవారం ఊరట కలిగించాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల తులం బంగారం ధర రూ.710 లు తగ్గి 86వేల 670 ల వద్ద ట్రేడ్ అవుతోంది.అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.700 లు తగ్గి 79వేల 400 లకు చేరింది. ఫిబ్రవరి ప్రారంభం నుంచి బంగారం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రారంభంలో 84 వేల 490 లున్న బంగారం ధర.. 12రోజుల్లో రూ. 2వేలకు పైగా పెరిగింది. ఇదే కంటిన్యూ అయితే మే నాటికి బంగారం ధరలు లక్షకు చేరుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో మార్పులను బట్టి బంగారం ధరలు హెచ్చు తగ్గులకు లోను కావచ్చు. బంగారం ధరలు ప్రపంచ మార్కెట్లో బంగారం ధరలపై ఆధారపడి ఉంటాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి రేట్లు,కేంద్రం విధించే దిగుమతి సుంకాలు, ద్రవ్యోల్బణం, ప్రపంచ ధరలలో మార్పు, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, వడ్డీ రేట్లలో హెచ్చుతగ్గులు, ఆభరణాల మార్కెట్లు వంటి అనేక అంతర్జాతీయ అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి.

# మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానాలకు రంగం సిద్ధం


- నాలుగేళ్లు గడుస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ పావులు
- పరిస్థితులకనుగుణంగా నిర్ణయం
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్




**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** జీహెచ్‌ఎంసీ ప్రస్తుత పాలక మండలికి నాలుగేళ్లు పూర్తి కావడంతో ఏ క్షణంలోనైనా మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్‌ఎంసీ రాజకీయాలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై నిర్ణయం ఉంటుందని చెప్పారు. నెంబర్ గేమ్‌ను బట్టి మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ఉంటుందని తెలిపారు. బీసీ మూవ్‌మెంట్ తెలంగాణ రాష్ట్రంలో బలంగా ఉందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన కులగణన సర్వేలో చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్ చేసిన సర్వేలో బీసీలు 51శాతం మంది ఉన్నారన్నారు. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు 90 శాతం మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా పిల్లలున్నారని చెప్పారు. రాష్ట్రంలో 60 లక్షల మందికి లెక్కలు లేవన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే బీసీలు ఒప్పుకోరని చెప్పుకొచ్చారు. పునర్విభజన జరిగితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు తెలంగాణకు తగ్గుతాయన్నారు. ప్రభుత్వం రీసర్వే చేస్తే కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొంటారని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేశాక రేవంత్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బీసీ సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# ఇసుక రవాణాను కట్టుదిట్టంగా మానిటరింగ్ చేయాలి..

**రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి**
**ఇందిరమ్మ ఇండ్లకు తీసుకొని ఉచితంగా అందించేలా చర్యలు**
**సామాన్య వినియోగదారులకు అతి తక్కువ ధరకు ఇసుక అందుబాటులో ఉండాలి**
**ఇసుక బుక్ చేసిన 48 గంటల లోగా వినియోగదారుడికి చేరాలి**
**అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు**
**ప్రతి ఇసుక రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాల ఏర్పాటు**
**ఇసుక సరఫరా పాలసీ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సిఎస్**




కరీంనగర్ జనతా న్యూస్: ఇసుక రవాణాను అధికారులు కట్టుదిట్టంగా మానిటరింగ్ చేయాలని, ప్రత్యేక అధికారులను నియమించాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఇసుక పాలసీ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, ఇసుక రీచ్ ల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ ఇసుక రవాణా నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. పేదల నిర్మించుకునే ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. సామాన్య ప్రజలకు అతి తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి రావాలని, ఇసుక సరఫరా చేసే ట్రాక్టర్లు, లారీలను ఎంపానల్ చేయాలని, ఇసుక బుక్ చేసిన 48 గంటల వ్యవధిలోగా వినియోగదారుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణా జరిగే వాహనాల ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేసి అక్రమ రవాణా కు అడ్డుకట్ట వేయాలని అన్నారు. ఇసుక రీచ్ ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, లైట్స్ ఏర్పాటు చేయాలని, ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ తో పాటు ఎంట్రీ ఎగ్జిట్లను ఏర్పాటు చేయాలని , ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, బ్లాక్ మార్కెట్ అరికట్టి పేదలకు ఇసుకను అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ఆన్లైన్ బుకింగ్ విధానంలో మార్పులు జరగాలని,



ఆఫీస్ టైమింగ్స్ సమయంలో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళలో మార్పులు చేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలో మానకొండూరు మండలం ఊటూరులో 6700 మెట్రిక్ టన్నులు, వీణవంక మండలం చల్లూరు లో 6900 మెట్టు టన్నుల ఇసుక నిలువలు ఉన్నట్లు తెలిపారు. ఈ రెండు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిఘా వ్యవస్థ ఉందన్నారు. ఇప్పటికే రెవెన్యూ, మైన్స్, పోలీస్, రవాణా శాఖల అధికారులు సంయుక్తంగా ఇన్స్పెక్షన్ చేసినట్లు తెలిపారు.

## ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ఇసుక రవాణా వ్యవస్థపై నిరంతర నిఘా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మైనింగ్, రవాణా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస, మైనింగ్, రవాణా అధికారులను బృందాలుగా ఏర్పాటు చేయాలని అన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసినా, అనుమతి కంటే ఎక్కువ లోడుతో ఇసుక తరలించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద నిఘా వ్యవస్థను పెంచాలని, సీసీ కెమెరాలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పి పురుషోత్తం, అసిస్టెంట్ జియాలజిస్ట్ వెంకటేశ్వర్, ఎంవిఐ రవికుమార్, ఏఎంవిఐ హరిత యాదవ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ డిస్పీ గంగాధర్,

### ఇండిపెండెంట్ గా పోటీ నుంచి విరమణ



**కరీంనగర్,జనతా న్యూస్:** మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ఎం. గంగాధర్ బుధవారం నాడు ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకున్నట్టు ప్రకటించారు. ఇటీవల డిఎస్పీ పదవికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీనియర్ కాంగ్రెస్ నేత వి.హన్మంతరావుతో పాటు సెక్రటేరియట్ కు వచ్చిన గంగాధర్ కు మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికార అభ్యర్థి డా. వి. నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాల్సిందిగా మంత్రి ఆయనకు సూచించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## సింగాపురంలో... కన్నుల పండుగగా.. వెంకటేశుని కల్యాణం

**మూడు రోజులపాటు భక్తులను అలరించిన బ్రహ్మోత్సవాలు**
**పెద్ద ఎత్తున హాజరైన భక్తులు**
**గోవింద నామ స్మరణతో మార్మోగిన ఆలయం**





హుజూరాబాద్ ఫిబ్రవరి 12 జనతా న్యూస్: హుజురాబాద్ మండలం సింగాపురంలోని శ్రీ పద్మ గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. వివాహ ఘట్టాలను, కన్యాదాన ఫలితాన్ని పుణ్యాన్ని వివరిస్తూ వేద పండితులు పణతుల మేఘరాజ్ శర్మ వ్యాఖ్యానం భక్తులను కట్టిపడేసింది. కళ్యాణోత్సవ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్, ఇంద్రనీల్, వొడితల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇంతకుముందు మూడు రోజులు జరిగిన హోమ కార్యక్రమంలో భాగంగా.. పూర్ణాహుతి కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య జరిగింది. అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. గోవింద నామస్మరణతో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ముగిశాయి. మూడు రోజులపాటు ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో, రంగవల్లులతో తీర్చిదిద్దారు. స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. వేద పండితులు పణతుల మేఘ రాజ్ శర్మ, కశ్యప్ శర్మ, కషోజ్జల రాజేశ్వర్ శర్మ, పనతుల కిరణ్ శర్మ, ఆలయ అర్చకులు రఘునాథ ఆచార్యులు, భరత్ ఆచార్యులు, పందిళ్ళ విజేందర్ శర్మ, పందిళ్ళ చంద్రశేఖర శర్మ వేద పఠనం చేశారు.

## విద్యార్థుల్లో కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్,జనతా న్యూస్: విద్యార్థులు దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ఉపాధ్యాయుల గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళ మేళ, సైన్స్ ఎగ్జిబిషన్ ను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కస్తూరిబా బాలికల పాఠశాల, వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు తయారుచేసిన వివిధ కళాకృతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు అందమైన వస్తువులను స్వతహాగా తయారు చేస్తున్నారని, ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ మేళాను సందర్శించాలని సూచించారు. విద్యార్థుల్లో ఎంతో కళా నైపుణ్యం బాగుందని, దాన్ని వెలికి తీయాలని అన్నారు. ప్రజలు ఈ మేళాను సందర్శించి అందమైన ఆకట్టుకునే కళాకృతులను కొనుగోలు చేయవచ్చని సూచించారు. ఈ మేళాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి పాల్గొన్నారు.

## జేఈఈ మేయిన్స్‌లో ఎస్ఆర్ విద్యార్థుల హవా




### -148మందికి ర్యాంకులు

తిమ్మాపూర్, జనతా న్యూస్ : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని జోనల్ ఇంచార్జ్ నేదురు తిరుపతి తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ గ్రామంలో గల ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యాసంస్థకు చెందిన 148మంది విద్యార్థులు తమ సత్తాచూపి జాతీయస్థాయిలో విజయ కేతనం ఎగరవేశారని ఆనందం వ్యక్తంచేశారు. మెయిన్స్ లో కరీంనగర్ జిల్లాలోని ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన కొల్లూరి హాసిని 99.3%, బుర్ర మాధవ్ 99.14%, గోవిందారపు శివ సాయి 98.53%, ముదిగంటి రుశిశ్వర్ రెడ్డి 98.10% దయ్యాల రాజ్ కుమార్ 97.61%, పోగులు ఆశ్రిత్ 96.26%, జవ్వాజ సహస్ర 94.35%, దొనకొండ సాయి చెందిన 92.18% మేకల సంజన 91.61% చరణ్ జోషి 91.12% కటకం శ్రీలేఖ 90% సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కళాశాల యాజమాన్యం తరపున అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.

ఇంతటి విజయానికి సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ లకు,లెక్చరర్ లకు, సిబ్బందికి యజమాన్యం తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జోనల్ ఇంచార్జ్ తిరుపతి ప్రకటించారు. అకాడమిక్ డీన్స్ అశోక్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగార్జున రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మారుతి, సరోత్తమ్ రెడ్డి, సీహెచ్ ప్రవీణ్ రెడ్డి, ఏవో లక్ష్మీప్రసాద్ పాల్గొని ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బొకేలు అందించి అభినందనలు తెలిపారు.

## ఘనంగా వెలుగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



**కోరుట్ల, జనతా న్యూస్ :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నగర్ లో గల వెలుగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ ఉత్సవాల్లో సీనియర్ పాత్రికేయుడు ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘాల రాష్ట్ర నాయకుడు బలిజ రాజారెడ్డి, సామల రమేష్,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సామల రమేష్, మున్సిపల్ మేనేజర్ చిట్యాల శ్రీనివాస్. మాజీ కౌన్సిలర్ సామల గంగా నరసయ్య, చిన్న సాయబు, నరసయ్య, భాస్కర్, దశరథం వేణుగోపాల్, సురేష్, నరేష్, సత్యం, ఉయ్యాల నరసయ్య, పొట్ట లక్ష్మణ్, గురు మంతుల సత్తయ్య , మగ్గిడి వెంకటి, పసుల కృష్ణ ప్రసాద్, పేట అశోక్, పసుల చిన్నయ్య, దామ కొండయ్య,దేవదాస్, రాజు,మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తనయుని విజయం కోసం తండ్రి.. పూజలు

**కొత్తగట్టు మత్స్య గిరీంద్ర స్వామి దేవాలయంలో**
**కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి ప్రత్యేక పూజలు**

హుజురాబాద్, ఫిబ్రవరి 12 జనతా న్యూస్ : తనయుని విజయం కోసం తండ్రి దేవాలయంలో పూజలు చేసిన దృశ్యం అందరినీ ఆకర్షించింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి బుధవారం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని అతి పురాతన మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన తన కుమారుని విజయాన్ని కాంక్షిస్తూ పూజలు చేశారు. తన తనయుని గెలుపుకు కృషి చేయాలని ఆయన కోరారు. కొత్తగట్టు దేవాలయం అతి పురాతనమైనదని ఎంతో మహత్తు కలిగిన విష్ణుమూర్తి ఆలయం సందర్శించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆలయ డైరెక్టర్ కోరం కొండల్ రెడ్డి తో పాటు పలువురు ఉన్నారు.



# కర్ణాటకలో ఎప్సిలాన్ గ్రూప్ రూ.15,350 కోట్ల పెట్టుబడి

ఎప్సిలాన్ గ్రూప్ కర్ణాటకలో ఈవీ బ్యాటరీ టెస్టింగ్, అధునాతన మెటీరియల్స్ కోసం..తయారీ, పరిశోధనా సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి రూ.15,350 కోట్ల పెట్టుబడి పెట్టే ప్రణాళికను బుధవారం ప్రకటించింది. బెంగళూరులో జరిగిన ఇన్వెస్ట్ కర్ణాటక సమ్మిట్‌లో ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎప్సిలాన్ తెలిపింది. ఈ వ్యూహాత్మక పెట్టుబడి, రాబోయే 10 ఏళ్లలో దశలవారిగా జరుగుతుంది. అధునాతన బ్యాటరీ సాంకేతికత కేంద్రంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేస్తామని 'ఎప్సిలాన్ గ్రూప్' పేర్కొంది. ఎంఓయూలో భాగంగా, ఎప్సిలాన్ గ్రూప్, దాని అనుబంధ సంస్థలైన ఎప్సిలాన్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, ఎప్సిలాన్ క్యామ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి స్థిరమైన, అధిక పనితీరు గల గ్రాఫైట్ యానోడ్, లిథియం ఐరన్ ఫాస్పేట్ కాథోడ్ బ్యాటరీ ఉత్పత్తులను తయారుచేస్తుంది. గ్రాఫైట్ యానోడ్ తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.9 వేల కోట్లు, ఎల్ఎఫ్‌పీ కాథోడ్ తయారీ ప్లాంట్‌కు రూ.6 వేల కోట్లు, బ్యాటరీ మెటీరియల్స్, బ్యాటరీ టెస్టింగ్ ఆర్అండ్‌డీ, శిక్షణా కేంద్రం కోసం రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది. చైనా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, స్థానిక బ్యాటరీ మెటీరియల్ ఎకోసిస్టంను నిర్మించడంలో తమ పెట్టుబడి కీలకమైన అడుగు అని ఎప్సిలాన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ 'విక్రమ్ హండా' తెలిపారు. ఈ పెట్టుబడి..దేశీయ, అంతర్జాతీయ ఈవీ తయారీదారు లకు కీలకమైన బ్యాటరీ మెటీరియల్స్ సరఫరాను మెరుగుపరుస్తుందని, భారత్‌ను గ్లోబల్ బ్యాటరీ హబ్‌గా మారుస్తుందని కంపెనీ తెలిపింది.

# ఎయిర్ ఫైబర్ సేవలపై ఎయిర్‌టెల్ ఫోకస్..

### నోకియాతో డీల్




ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు విస్తరించేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా హైస్పీడ్ 5జీ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ డివైజులు, వైఫై సొల్యూషన్స్ సరఫరా కోసం నోకియా, క్వాల్‌కామ్‌తో జట్టుకట్టింది. ఈ డివైజులు భారత్‌లోనే తయారు కానున్నాయని కంపెనీ ఓ ప్రకటనలో బుధవారం తెలిపింది. అయితే, కాంట్రాక్టుకు సంబంధించిన వివరాలు మాత్రం కంపెనీ వెల్లడించలేదు. దేశీయంగా బ్రాండ్‌బ్యాండ్ వినియోగం పెరుగుతోంది. అదే స్థాయిలో ఫైబర్ కనెక్టివిటీ విస్తరించడం లేదు. దీంతో జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ఎయిర్‌ఫైబర్ సేవలకు శ్రీకారం చుట్టాయి. ఫైబర్‌నెట్ విస్తరించని ప్రాంతంలో బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించేందుకు ఈ ఎయిర్‌ఫైబర్ సేవలు ఉపయోపడతాయి. దీన్ని మరింత వేగంగా విస్తరించేందుకు ఈ డీల్ ఎయిర్‌టెల్‌కు ఉపయోగపడనుంది. కాంట్రాక్టులో భాగంగా ఫిక్స్‌డ్ వైర్‌లైన్ యాక్సెస్ ఔట్‌డోర్ రిసీవర్లు, వైఫై 6 యాక్సెస్ పాయింట్లను నోకియా సరఫరా చేయనుంది. నోకియా అందించే ఫాస్ట్‌మైల్ 5జీ ఔట్‌డోర్ రిసీవర్లకు ఒకటి కంటే ఎక్కువ యూనిట్లను కనెక్ట్ చేయొచ్చు. అంటే రెండిళ్లకు ఒకే యూనిట్ అమర్చొచ్చు. దీనివల్ల కంపెనీకి ఖర్చులు సైతం తగ్గనున్నాయి. అలాగే, ఈ యూనిట్లు పవర్-ఓవర్- ఈథర్‌నెట్ టెక్నాలజీ సాయంతో పనిచేస్తాయి. దీని కోసం ప్రత్యేకంగా పవర్ సప్లయ్ అవసరం లేదు. లోపల వైఫై యాక్సెస్ పాయింట్లను వచ్చే పవర్‌తో ఇవి పనిచేస్తాయి. దీనివల్ల గోడలు, బాల్కనీ, స్తంభాలు.. ఇలా ఎక్కడైనా వీటిని అమర్చొచ్చు. ఇంటి లోపల భాగంలో నోకియా వైఫై 6 యాక్సెస్ పాయింట్లను అమర్చుతారు. ఇవి పూర్తిగా రీసైకిల్ చేయడానికి వీలుండే మెటీరియల్‌తో రూపొందుతాయని కంపెనీ వెల్లడించింది.

# స్వదేశీ భావజాలంతో దేశం ఆర్థికంగా మనుగడ సాధిస్తుంది..

### స్వదేశీ మేళాతో ఉత్పత్తులు, వ్యాపారులకు, కళాకారులకు గుర్తింపు...



కరీంనగర్,జనతా న్యూస్: స్వదేశీ జాగరణ మంచ్ నిర్వహిస్తున్న స్వదేశీ మేళాతో స్థానిక కళాకారులు , ఉత్పత్తులు , వ్యాపారులను అమితంగా ప్రోత్సహించడంఅభినందనీయమని , స్వదేశీ భావజాలం కలిగి ఉండి స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయడం వల్ల దేశానికి ఆర్థిక ప్రయోజనమే కాకుండా, కుటుంబం, గ్రామం, రాష్ట్రం, దేశం మొత్తం స్వయం సమృద్ధిని సాధిస్తుందని స్వాలంబి భారత్ అభియాన్ ప్రాంత కో కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మద్య క్షేత్ర సంఘటన కార్యదర్శి జగదీష్ జి , రాష్ట్రీయ స్వయంసేక్ సంఘ్ తెలంగాణ పూర్వ సంఘ్ చాలాక్ బుర్ల దక్షిణామూర్తి అన్నారు. బుధవారం స్వదేశీ మేళా ప్రారంభోత్సవ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారూ మాట్లాడుతూ ముఖ్యంగా స్వదేశీ అనేది మన స్వయం సమృద్ధి తో పాటు దేశ ఆత్మ నిర్భరతను అన్ని రంగాల్లో సహకారం చేసే అద్భుత తారక మంత్రమన్నారు. ముఖ్యంగా స్వదేశీ వస్తువుల తయారీ దిగుమతి చేసుకున్న వస్తువులపై ఆధారపడటాన్ని అధిగమించడంలో సహాయపడుతుందని , ప్రజలు స్వదేశీ వస్తువులు, ఉత్పత్తులను ఉపయోగించాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రధానంగా స్వదేశీ వస్తువుల తయారీదారుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వదేశీ మేళా ప్రోగ్రాంలో భాగంగా పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. విద్యా తో పాటుగా ఉద్యోగం, వ్యాపారం లల్లో రాణించలని, ఉద్యోగం ఇచ్చే స్థాయి కి ఎదగాలని ఈ వర్క్ షాప్ కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సూపరిండెన్డెంట్ సుంకర శ్రీనివాస్ , ఐ వి వై స్కూల్ చైర్మన్ పసువుల మహేష్ సూచించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై పై సూచనలు చేసి, విద్యార్థుల భవిష్యత్తు ను తీర్చిదిద్దికోవడానికి పలు ఉదాహరణలు చెప్పారు. . ఇట్టి కార్యక్రమంలో స్వదేశీ మేళా బాధ్యులు ముక్క హరీష్ బాబు, గంప వెంకట్, కళ్లెం వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా దాచిపెట్టిన 205.45 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్న టాస్కోర్స్ పోలీసులు



సిద్దిపేట,జనతా న్యూస్: చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇబ్రహీం నగర్ గ్రామంలో పంతం లక్ష్మీనారాయణ తన ఇంటిలో ఎలాంటి ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడుపుచున్నాడని నమ్మదగిన సమాచారం పై ఈరోజు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది చిన్నకోడూర్ పోలీసులు వెళ్లి ఇంటిలో తనిఖీలు నిర్వహించగా బీర్లు, విస్కీ బాటిల్ లు, లిక్కర్ బాటిల్ అందాజ మొత్తం 205.45 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది చిన్నకోడూర్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ మేడమ్ గారి ఆదేశానుసారం జిల్లాలో అక్రమ వ్యాపారాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, బెల్ట్ షాపులు నడిపిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలుజరుగుతుందని తెలిపారు. గ్రామాలలో, పట్టణాలలో ఇసుక, అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన బెల్ట్ షాపులు నడిపిన, గ్యాంబ్లింగ్, పేకాట, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667 447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలి

### పీవోల శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్




**కరీంనగర్, జనతా న్యూస్:** ఎలక్షన్ కమిషన్ నియమావళికి అనుగుణంగా ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం అందించిన కరదీపిక లోని మార్గదర్శకాలు పాటించాలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ తేదీన నిర్ణీత ఫారాలను పొరపాటు లేకుండా పూరించాలని, ఫారం 16, పిఓ డైరీ ని జాగ్రత్తగా నింపాలని సూచించారు. ఓటర్ వివరాలను పరిశీలించి గుర్తింపు కార్డుతో సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలపై ప్రతి ప్రిసైడింగ్ అధికారికీ పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్స్ సీల్ విధానం డెమోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి పవన్ కుమార్, డి ఆర్ డి ఓ శ్రీధర్, మాస్టర్ ట్రైనర్లు అమరేందర్ రెడ్డి, సంపత్, రజనీష్ పాల్గొన్నారు.

# నెమలి మృతి



తిమ్మాపూర్ జనతా న్యూస్ మండలంలోని రామకృష్ణ కాలనీ శివారులో విద్యుత్ షాక్ తగిలి నెమలి మృతి చెందింది. స్థానికులు కథన మేరకు... రామకృష్ణ కాలనీ శివారులోని ఉపగ్న హోమ్స్ సమీపంలో నెమలి ఎగురుతూ విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాగురై మృతి చెందింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

# ఆదాయపు పన్ను బిల్లు


## : 622 పేజీలు - 536 సెక్షన్లు




ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురానున్నట్లు ఇటీవల ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఆదాయపు పన్ను బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ బిల్లును గురువారం (ఫిబ్రవరి 13న) లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. కాగా.. ఇందులో 536 సెక్షన్లు, 23 ఛాప్టర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961లో 298 సెక్షన్లు ఉండగా.. కొత్తగా తీసుకురానున్న బిల్లులో 536 సెక్షన్లను చేర్చినట్లు తెలిసింది. ప్రస్తుతమున్న 14 షెడ్యూల్‌ను కొత్త చట్టంలో 16కు పెంచనున్నారు. అయితే, ఇప్పటి చట్టంలో మాదిరిగానే నూతన బిల్లులోనూ 23 ఛాప్టర్లు ఉన్నాయి. కాగా.. పేజీల సంఖ్యను ప్రస్తుతమున్న దానితో పోలిస్తే దాదాపు సగానికి సగం తగ్గించారు. కొత్త బిల్లును 622 పేజీల్లో రూపొందించారు. 1961లో ఆదాయపు పన్ను చట్టాన్ని తీసుకొచ్చినప్పుడు దాన్ని 880 పేజీల్లో పొందుపర్చారు. ఆ తర్వాత గత ఆరు దశాబ్దాలుగా ఈ చట్టానికి పలు సవరణలు చేయడంతో పేజీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను చట్టంలో వ్యవస్థీకృత అంశాలు, పన్ను పథకాలు, ఇతర నిబంధనలకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ల కోసం పార్లమెంట్ వద్దకు సవరణల రూపంలో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అయితే, ప్రతిపాదిత బిల్లులో ఆ అవసరం లేకుండా.. సీబీడీటీకి కొన్ని స్వతంత్ర అధికారాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇకపై ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ రూల్స్, డిజిటల్ ట్యాక్స్ మానిటరింగ్ సిస్టమ్స్ వంటి వాటిని సీబీడీటీనే రూపొందించేలా కొత్త బిల్లులో ప్రతిపాదనలు చేశారు. గురువారం ఈ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత దీన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించనున్నట్లు తెలుస్తోంది. ఆదాయపు పన్నును సరళీకరించేందుకు, పన్ను విధానాన్ని సులువుగా అర్థం చేసుకునేందుకు కొత్త చట్టాన్ని తీసుకురాబోతున్నామని ఇటీవల బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దీనిద్వారా అదనపు పన్ను భారమేమీ ఉండదని పేర్కొన్నారు. ఆదాయపు పన్ను చట్టాన్ని సమీక్షించాలంటూ ఐటీ విభాగానికి ఇప్పటివరకు 6,500 సూచనలు వచ్చాయి.

# సంక్షేమ పథకాల వల్లే కార్మికులు పని చేయట్లేదు

### ఎల్ అండ్ టీ ఛైర్మన్ వ్యాఖ్యలు



'భార్యను ఎంతసేపు చూస్తూ ఉండిపోతారు.. ఆదివారాలూ పనిచేయండి' అంటూ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ మరోసారి వార్తల్లో నిలిచారు. నిర్మాణ రంగంలో కార్మికుల వలసలు తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ఆయన.. సంక్షేమ పథకాల అమలు కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వాటివల్లే కార్మికులు పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. చెన్నైలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య సదస్సులో పాల్గొన్న ఆయన కార్మికుల కొరత అంశాన్ని ప్రస్తావించారు. "మా సంస్థలో ప్రస్తుతం 2.5 లక్షల మంది ఉద్యోగులు, 4 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఉద్యోగుల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ ఆ విషయం పెద్దగా బాధించట్లేదు. కానీ, కార్మికుల లభ్యత గురించి నేను ఎక్కువగా ఆందోళన చెందుతున్నా. ఈ రోజుల్లో కార్మికులు అవకాశాల కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లేందుకు ఇష్టపడట్లేదు. బహుశా స్థానికంగా వారికి సంపాదన బాగానే ఉండొచ్చు. ఇక, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కారణం కావొచ్చు. వాటివల్లే వారు వేరే ప్రాంతాలకు వెళ్లి పనిచేయడానికి ఆసక్తి చూపించట్లేదు" అని సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు. "అయితే, కేవలం కార్మికుల్లో మాత్రమే కాదు.. వైట్ కాలర్ ఉద్యోగాలు చేస్తున్న వృత్తి నిపుణుల్లోనూ ఇదే భావన ఉందనిపిస్తోంది. నేను ఎల్ అండ్ టీ సంస్థలో ఇంజినీర్‌గా చేరినప్పుడు మా బాస్ దిల్లీలో ఉద్యోగం చేయాల్సిఉంటుందని చెప్పారు. కానీ, ఈ రోజుల్లో ఎవరైనా వ్యక్తిని అలా అడిగితే.. 'బై' అంటూ వెళ్లిపోతున్నారు" అని వివరించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ మధ్య వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. "ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి. వారానికి 90 గంటల పాటు పనిచేయాలి. ఆదివారం సెలవునూ వదిలేయాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో పెను దుమారం లేపాయి. దీనిపై ఆ తర్వాత కంపెనీ స్పష్టతనిచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం అంటూ తన ఛైర్మన్ వ్యాఖ్యలను సమర్థించింది.

# బీట్స్ కొత్త ఇయర్‌ఫోన్స్.. ధర 29వేల పైనే!

ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ బీట్స్ ఆకర్షణీయమైన డిజైన్‌తో కొత్త ఇయర్‌ఫోన్స్ భారత్‌లో లాంచ్ చేసింది. పవర్‌బీట్స్ ప్రో 2 పేరిట కొత్త ఫీచర్లతో దీన్ని పరిచయం చేసింది. యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్, డైనమిక్ హెడ్ ట్రాకింగ్ సదుపాయంతో ఆకర్షణీయమైన రంగుల్లో వీటిని తీసుకొచ్చారు. వీటి ధర, ఫీచర్లపై ఓ లుక్కేయండి. పవర్‌బీట్స్ ప్రో 2 ధర రూ.29,900గా కంపెనీ నిర్ణయించింది. ఎలక్ట్రిక్ ఆరెంజ్, హైపర్ పర్పుల్, జెట్ బ్లాక్, క్విక్ సాండ్.. రంగుల్లో లభిస్తాయి. ప్రస్తుతం కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఫిబ్రవరి 13 నుంచి ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వేదికగా కొనుగోలు చేసేందుకు వీలు కల్పిస్తున్నారు. డైనమిక్ హెడ్ ట్రాకింగ్ టెక్నాలజీతో స్పెషల్ ఆడియోకు సపోర్ట్ చేస్తాయి. ఆండ్రాయిడ్, ఐఫోన్ యూజర్లకు బ్లూటూత్ 5.3 కనెక్టివిటీకి ఈ ఇయర్‌ఫోన్స్ సపోర్ట్ చేస్తాయని కంపెనీ లాంచింగ్ సమయంలో వెల్లడించింది. యాపిల్ డివైజెస్‌లో అయితే వన్- టచ్ పెయిరింగ్, ఆటోమేటిక్ స్విచ్చింగ్, ఆడియో షేరింగ్, హ్యాండ్- ఫ్రీ సిరీ.. లాంటి ఫీచర్లకు సపోర్ట్ చేస్తాయి. అయితే ఈ ఫీచర్లన్నింటినీ బీట్స్ యాప్ ద్వారా ఆండ్రాయిడ్ యూజర్లు వినియోగించుకోవచ్చు. ఐదు సైజుల ఇయర్ టిప్స్‌ని ఈ ఇయర్‌ఫోన్స్‌కి బీట్స్ ఇస్తోంది. యాపిల్ హెచ్2 చిప్‌తో వస్తోన్న ఈ ఇయర్‌ఫోన్స్ 10 గంటల పాటు ప్లే బ్యాక్ టైమ్ కలిగిఉంటాయి. ఛార్జింగ్ కేసుతో పాటు 45 గంటల పాటు పని చేస్తాయి. కేవలం 5 నిమిషాల ఛార్జింగ్‌తో 90 నిమిషాల పాటు ప్లే బ్యాక్ టైమ్ ఇస్తాయి.






# టీమ్‌ఇండియా ఆల్‌రౌండ్ షో

## ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్

**అహ్మదాబాద్:** ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమ్‌ఇండియా 142 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. కీలక బ్యాటర్లంతా రాణించడంతో తొలుత భారత్ సరిగ్గా 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. శుభ్‌మన్ గిల్ (112, 102 బంతులలో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. ఈ భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్‌కు శుభారంభం దక్కినా తర్వాత చతికిలపడింది. ఆ జట్టు 34.2 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. టామ్ బాంటన్ (38), అట్కిన్సన్ (38, 19 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్లు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (23), బెన్ డకెట్ (34) పరుగులు చేశారు. జో రూట్ (24), హ్యారీ బ్రూక్ (19), బట్లర్ (6), లివింగ్‌స్టన్ (9) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. చివర్లో అట్కిన్సన్ పోరాటంతో ఇంగ్లాండ్ స్కోరు 200 దాటింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్‌కు తలో వికెట్ దక్కింది. భారత బ్యాటర్లలో గిల్ సెంచరీకితోడు శ్రేయస్ అయ్యర్ (78, 64 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదిరే ప్రదర్శన చేశాడు. కొంతకాలంగా విఫలమవుతున్న విరాట్ కోహ్లీ (52బీ 55 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) ఫామ్‌లోకి వచ్చేశాడు. రోహిత్ శర్మ (1) ఈ సారి నిరాశపర్చాడు. కేఎల్ రాహుల్ (40, 29 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. హార్దిక్ పాండ్య (17, 9 బంతుల్లో 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. వాషింగ్టన్ సుందర్ (14), అక్షర్ పటేల్ (13), హర్షిత్ రాణా (13) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 4, మార్క్‌వుడ్ 2, సకిబ్, అట్కిన్సన్, జో రూట్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

### ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా గిల్

ఈ సిరీస్‌లో అదరగొట్టిన శుభ్‌మన్ గిల్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు. గిల్ తొలి వన్డేలో 87, రెండో వన్డేలో 60 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇక, మూడో వన్డేలో సెంచరీ చేయడంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

## గూగుల్ ట్రెండ్స్‌లో 'భారత్-ఇంగ్లండ్' మ్యాచ్ రికార్డ్..!




మూడో వన్డేలో భాగంగా భారత్- ఇంగ్లండ్ మధ్య మైదానంలో జరుగుతున్న పోరు కోసం క్రికెట్ అభిమానులు ఉత్కంఠగా జరుగుతోంది. ప్రస్తుతం ఇరుదేశాల జట్ల మధ్య మ్యాచ్ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే నెటిజన్లు ఈ మ్యాచ్ కోసం ఆన్‌లైన్లో విపరీతంగా వెతకడం విశేషం. అభిమానులు మ్యాచ్‌కు ముందు 'భారత్ వర్సెస్ ఇంగ్లండ్' క్వెరీని ఏకంగా 10లక్షల సార్లు సెర్చ్ చేశారు. 'ఈ మ్యాచ్ ఏ ప్రసార వేదికగా చూడాలి'.. 'ఏఏ భాషల్లో ప్రసారం కొనసాగుతోంది" అంటూ తెగ వెతికేశారు. లైవ్ మ్యాచ్ మొదలైనప్పటికీ ఈ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో శోధనలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రశ్న గూగుల్ ట్రెండ్‌లో ఉంది. కాగా.. ప్రస్తుతం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్- ఇంగ్లండ్ మ్యాచ్ కొనసాగుతోంది. టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. రోహిత్ శర్మ ఆట ప్రారంభంలోనే ఔట్ అయినప్పటికీ.. టీమిండియా దూకుడు కొనసాగించింది. శుభమన్ గిల్ సెంచరీ బాదాడు. ఈ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో వేగంగా 2500 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.



## గంగూలీకి బిడ్ వేయలేదు..

### ఐదు నిమిషాల్లోనే 400 మెసేజ్‌లు: భట్టాచార్య

ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)కు సౌరభ్ గంగూలీ కూడా సారథిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. కానీ, అతడి నాయకత్వంలో ఒక్కసారి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది. దీంతో అతడిని 2011 ఐపీఎల్ వేలం సమయంలో కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. మెగా వేలంలోనూ అతడి కోసం బిడ్డింగ్ వేయలేదు. అప్పుడు చోటు చేసుకున్న అనుభవాలను కేకేఆర్ మాజీ డైరెక్టర్ జాయ్ భట్టాచార్య తాజాగా ఓ కార్యక్రమంలో వెల్లడించారు. గంగూలీ అభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైనట్లు భట్టాచార్య తెలిపారు. కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే ఫ్రాంచైజీ యజమాని షారుక్ ఖాన్‌కు 400 మెసేజ్‌లు వచ్చాయని భట్టాచార్య తెలిపారు. సాల్ట్‌లేక్‌లో ఉన్న మా నాన్న ఇంట్లో నా అడ్రస్ బోర్డును తొలగించాలేమోనన్న పరిస్థితి తలెత్తిందని భట్టాచార్య వివరించారు. నాడు గంగూలీని తమతో అట్టిపెట్టుకోకూడదనే నిర్ణయం షారుక్‌దేనని తెలిపారు.

## శుభ్‌మన్ గిల్ ఆల్‌టైమ్ రికార్డు

ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో గిల్ అదరగొడుతున్నాడు. తొలి వన్డేలో 87, రెండో వన్డేలో 60 పరుగులు చేసిన ఈ బ్యాటర్ అహ్మదాబాద్‌లో జరుగుతున్న మూడో వన్డేలో (112, 102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో గిల్ అద్భుతమైన రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా (50 ఇన్నింగ్స్‌లు) 2500 పరుగులు చేసిన బ్యాటర్ గా రికార్డుల్లోకెక్కాడు. అంతకుముందు ఈ రికార్డు సౌతాఫ్రికా మాజీ ఆటగాడు హషీమ్ ఆమ్లా (53 ఇన్నింగ్స్‌లు) పేరిట ఉండేది. అంతేకాదు ఈ ఫార్మాట్‌లో భారత్ తరఫున వేగంగా 2500 రన్స్ చేసిన శ్రేయస్ అయ్యర్ (59 ఇన్నింగ్స్‌లు) రికార్డును బ్రేక్ చేశాడు.

### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్ 2

ఇంగ్లాండ్‌తో మూడో వన్డే ఆరంభానికి ముందు ఐసీసీ ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ (773 పాయింట్లు)ను వెనక్కినెట్టి గిల్ (781 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచాడు. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ (786 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లీ రెండు స్థానాలు దిగజారి ఆరో స్థానానికి పడిపోయాడు. శ్రేయస్ అయ్యర్ ఒక స్థానం మెరుగై పదో ర్యాంకు దక్కించుకున్నాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీకి కొత్త కెప్టెన్..

### ఐదు మార్పులతో ఆస్ట్రేలియా స్క్వాడ్

వన్డే ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముంగిట ఆ జట్టుకు గాయాలతో పాటు అనివార్య కారణాలు ఇబ్బంది పెడుతున్నాయి. ఏకంగా ఐదు మార్పులతో ఛాంపియన్స్ ట్రోఫీ కోసం స్క్వాడ్‌ను ప్రకటించాల్సి వచ్చింది. స్టీవ్ స్మిత్ సారథ్యంలో ఆస్ట్రేలియా బరిలోకి దిగనుంది. రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్, పేసర్ జోష్ హేజిల్‌వుడ్, ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ గాయాలతో వైదొలిగారు. తొలుత జట్టులో స్థానం దక్కించుకున్న మార్కస్ స్టొయినిస్ వన్డేలకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. మళ్లీ షాక్ ఇస్తూ మిచెల్ స్టార్క్ కూడా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పక్కకు వైదొలిగాడు. శ్రీలంకతో రెండు వన్డేల సిరీస్‌కూ అందుబాటులో ఉ ఒడటం లేదని స్టార్క్ వెల్లడించాడు. అతడు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడనేది తెలియరావడం లేదు. స్టార్క్ నిర్ణయాన్ని గౌరవిస్తామని చెబుతూ ఐదు మార్పులతో ఆసీస్ జట్టును మేనేజ్‌మెంట్ ప్రకటించింది. "మిచెల్ స్టార్క్ పరిస్థితిని అర్థం చేసుకున్నాం. అతడి నిర్ణయాన్ని గౌరవిస్తాం. అంతర్జాతీయ క్రికెట్ పట్ల చూపించే అతడి నిబద్ధత అద్భుతం. ఆస్ట్రేలియాను ఎన్నో మ్యాచుల్లో గెలిపించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో అతడు లేకపోవడం మాకు నష్టమే. కానీ, టోర్నీలో నిరూపించుకోవడానికి మరొక పేసర్‌కు ఇదొక మంచి అవకాశం"




అని చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీ వెల్లడించారు.

**ఆసీస్ స్క్వాడ్ :** స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, అలెక్స్ కేరీ, బెన్ డ్వారిషూస్, నాథన్ ఎల్లిస్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, స్పెన్సన్ జాన్సన్, మార్నస్ లబుషేన్, గ్లెన్ మాక్స్‌వెల్, తన్వీర్ సంఘా, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా. ట్రావెల్ రిజర్వ్: కూపర్ కొన్నోలీ


## అతడు నెంబర్ వన్ బౌలర్..

### సిరాజ్‌ను పక్కనపెట్టడంపై నెట్టింట విమర్శలు

భారత స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. వెన్ను నొప్పి నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడికి మేనేజ్‌మెంట్ విశ్రాంతి ఇచ్చింది. బుమ్రా స్థానంలో యువ పేసర్ హర్షిత్ రాణాకు అవకాశం దక్కింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు బదులు వరుణ్ చక్రవర్తిని మేనేజ్‌మెంట్ స్క్వాడ్‌లోకి తీసుకుంది. ఇక్కడే సిరాజ్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సిరాజ్‌ను ప్రధాన స్క్వాడ్‌లోకి కాకుండా.. నాన్ ట్రావెల్ రిజర్వ్‌గా ఎంపిక చేసింది. సీనియర్ పేసర్‌ను పక్కనపెట్టడం సరైంది కాదనే భావనను వ్యక్తంచేశారు. బుమ్రా తర్వాత 2022 నుంచి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఉన్న సిరాజ్‌ను ఎంపిక చేయలేదని.. 2023 జనవరిలో వన్డే టాప్ బౌలర్‌గా నిలిచాడని అభిమానులు గుర్తు చేశారు. "బుమ్రా లేడు. షమీ ఇంకా పూర్తిస్థాయిలో ఫామ్ అందుకోలేదు. కుర్రాడిగా ఉన్న హర్షిత్ రాణాను పరీక్షించడం అవసరమా? సిరాజ్‌కు ఎందుకు అవకాశం ఇవ్వలేదు? మ్యాచ్ విన్నర్ అయిన సిరాజ్‌కు జట్టులో స్థానం లేకుండా చేయడం అత్యంత దారుణం" "భారత ప్రధాన కోచ్ ఏకపక్షంగా, స్వార్థంతో నిర్ణయాలు తీసుకుంటున్నట్లుంది. అతడు కేవలం



కేకేఆర్ ప్లేయర్లను మాత్రమే జట్టులోకి ఎంపిక చేస్తాడేమో. సిరాజ్‌ను కాదని హర్షిత్‌ను తీసుకోవడం, యశస్వి స్థానంలో వరుణ్‌ను ఎంపిక చేయడం చూస్తే అదే నిజమనిపిస్తోంది. భారత క్రికెట్‌లో ఇలాంటివి చోటుచేసుకోవడం బాధాకరం" "జట్టులో ఐదుగురు స్పిన్నర్లా? కొంచెమైనా ఆలోచించలేదా? ఒక స్పిన్నర్‌కు బదులు సిరాజ్‌ను తీసుకోవాల్సింది. యశస్వి జైస్వాల్‌ను కూడా పక్కనపెట్టారు. సుందర్ స్థానంలో యశస్విని ఉంచితే బాగుండేది"





## నా వ్యాఖ్యలను ఎవరూ తప్పుగా అనుకోవద్దు: అనసూయ

జబర్దస్త్ షో ద్వారా అనసూయ బాగా పాపులరైన విషయం తెలిసిందే. ఆ షోలో తన యాంకరింగ్ తో పాటూ అందాలతో కూడా ఆకట్టుకుంది అనసూయ. ఓ వైపు యాంకర్ గా చేస్తూనే సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన అనసూయ రామ్ చరణ్ నటించిన రంగస్థలంలో రంగమ్మత్తగా నటించి మంచి గుర్తింపు అందుకుంది. ఆ సినిమా తర్వాత అనసూయ యాంకరింగ్ మానేసి పూర్తిగా సినిమాల వైపు మళ్లింది. రీసెంట్ గా వచ్చి సెన్సేషనల్ హిట్ గా నిలిచిన పుష్ప2లో కూడా అనసూయ నటించిన విషయం తెలిసిందే. సినిమాల్లో నటిస్తూనే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ రెగ్యులర్ గా తన ఫోటోలను, అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఉంటుంది అనసూయ. అప్పుడప్పుడు ఈమె వేసే ట్వీట్స్, అమ్మడు చేసే కామెంట్స్ వల్ల అనవసరమైన వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటుంది అనసూయ. తాజాగా అనసూయ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేసింది. నేను నాకు ఎదురైన అనుభవాన్ని, నేను చూసిన సంఘటనలను మాత్రమే షేర్ చేసుకున్నాను తప్పించి ఎవరినీ బ్లేమ్ చేయలేదని, కేవలం అందరికీ అవగాహన రావాలనే అలా మాట్లాడానని, నేను అనని వాటిని అన్నట్టు ఎవరూ ప్రాజెక్ట్ చేయొద్దని అనసూయ పోస్ట్ చేసింది. అంతేకాదు, ఎవరేమనుకున్నా అవేమీ తన క్యారెక్టర్ ను డిసైడ్ చేయలేవని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని, తనను అర్థం చేసుకునే వారికి మాత్రమే తన ప్రేమను అందిస్తానని అనసూయ ట్వీట్ లో పేర్కొంది. దీంతో అనసూయ ఈ ట్వీట్ ఎవరిని ఉద్దేశించి వేసిందనేది ఆసక్తికరంగా మారింది. అయితే రీసెంట్ గా అనసూయ ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూలో తన డ్రెస్సింగ్ గురించి, ఫ్యామిలీ గురించి, రిలేషన్‌షిప్ గురించి అనూ ఎన్నో చెప్పుకొచ్చింది. తన వ్యాఖ్యల వల్ల అందరూ అనసూయను నెట్టింట తెగ ట్రోల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అనసూయ ఆ ట్వీట్ చేసిందని అర్థమవుతుంది. ప్రస్తుతం అనసూయ చేసిన ట్వీట్ నెట్టింట వైరల్ అవుతుంది. అయినా ఇలా వివాదాల్లో నిలవడం అనసూయకు కొత్తేమీ కాదు.

## అస్సలు ఊహించలేదు

### ‘దబిడి దిబిడి’ కాంట్రవర్సీపై ఊర్వశీ రౌతేలా

‘డాకు మహారాజ్’లో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణతో కలిసి నటించారు బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా. ఇందులో బాలయ్యతో కలిసి ఆమె ‘దబిడి దిబిడి’ పాటకు డ్యాన్స్ చేశారు. ఈ పాట విడుదలైన సమయంలో కొరియోగ్రఫీపై వచ్చిన కాంట్రవర్సీ గురించి తాజాగా ఊర్వశీ రౌతేలా స్పందించారు. ప్రేక్షకుల నుంచి ఈవిధమైన స్పందన తాను అస్సలు ఊహించలేదని అన్నారు. ఆ పాట, అందులోని స్టెప్పులను ప్రేక్షకులు ఆదరిస్తారనుకున్నానని ఆమె చెప్పారు. కానీ, ఈవిధంగా మాట్లాడతారని తాను అస్సలు అనుకోలేదని తెలిపారు. “రిహార్సల్స్ అంతా ప్రశాంతంగా జరిగింది. అన్ని పాటలకు ఏవిధంగా కొరియోగ్రఫీ ఉంటుందో అదేవిధంగా ఈ పాటకూ చేశాం. శేఖర్ మాస్టర్ ఈ పాటకు డ్యాన్స్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పటికే నాలుగుసార్లు ఆయనతో కలిసి వర్క్ చేశాను. ఆయన స్టెప్పులు చెప్పినప్పుడు నాకు ఏమాత్రం విభిన్నంగా లేదా అభ్యంతరకరంగా అనిపించలేదు. సాధారణమైన స్టెప్పుల మాదిరిగానే భావించా. కానీ, పాట విడుదలయ్యాక సోషల్‌మీడియాలో వచ్చిన విమర్శలు చూసి షాకయ్యా. కొరియోగ్రఫీని ప్రేక్షకులు తప్పుపట్టడానికి కారణం ఏమిటో అంచనా వేయడానికి కూడా సమయం లేకపోయింది. అంతా సడెన్‌గా జరిగిపోయింది. రిహార్సల్స్ చేస్తున్నప్పుడు ఇలాంటి విమర్శలు వస్తాయని మేము అస్సలు ఊహించలేదు. రిహార్సల్స్ క్లిప్స్ విడుదల చేసినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదు” అని ఊర్వశీ రౌతేలా తెలిపారు. ఏదేమైనా సోషల్‌మీడియా వేదికగా కొంతమంది కావాలని చేసే వ్యాఖ్యలను తాను పట్టించుకోనని అన్నారు. వివరణాత్మక విమర్శలను తాను స్వాగతిస్తానని చెప్పారు.



## భారతీయులంతా చూడాల్సిన చిత్రమిది..

### ఎమర్జెన్సీపై మృణాల్ పోస్ట్

కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం ‘ఎమర్జెన్సీ’. ఎన్నో వాయిదాల అనంతరం జనవరి 17న ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా ఈ సినిమాను వీక్షించినట్లు హీరోయిన్ మృణాల్ ఠాకూర్ పోస్ట్ పెట్టారు. కంగనా రనౌత్‌పై ప్రశంసలు కురిపించారు. నటిగా కంగనా సినీ కెరీర్ గురించి ప్రస్తావించారు. “మా నాన్నతో కలిసి ‘ఎమర్జెన్సీ’ చూశాను. ఆ సినిమా అందించిన అనుభూతి నుంచి ఇంకా బయటకు రాలేకపోతున్నా. కంగనా అభిమానిగా ఈ సినిమాను బిగ్‌స్క్రీన్‌పై చూడడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది ఆమెకు అద్భుతమైన విజయం. ‘గ్యాంగ్‌స్టర్’ నుంచి ‘క్వీన్’ వరకు.. ‘తను వెడ్స్ మను’ నుంచి ‘మణికర్ణిక’, ‘తలైవి’ వరకు.. ఇప్పుడు తాజాగా ‘ఎమర్జెన్సీ’ ఇలా నిరంతరం ఆమె నటనలో సరిహద్దులు దాటుతూ అద్భుతమైన ప్రతిభతో ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్నారు. ఈ సినిమాలోని ప్రతి అంశం నన్ను ఆకట్టుకుంది. కెమెరా యాంగిల్స్, కాస్ట్యూమ్స్.. ఇలా ప్రతిదీ నన్ను ఆకర్షించాయి. ఈ చిత్రంతో కంగనా దర్శకురాలిగానూ ఇండస్ట్రీలో చెరగని ముద్ర వేశారు. స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం, ఎడిటింగ్ అన్నీ బాగున్నాయి” అని అన్నారు. “కంగనాతో పాటు నటీనటులంతా అద్భుతంగా నటించారు. ఆమె కేవలం నటి మాత్రమే కాదు.. నిజమైన కళాకారిణి. సవాలుతో కూడిన పాత్రలు పోషించడంలో ఆమె ధైర్యం ప్రశంసనీయం. సినిమాపై మీకున్న అంకితభావం ప్రతి ఫ్రేమ్‌లోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఎవరైనా ఈ సినిమాను చూడకపోతే కచ్చితంగా చూడండి. భారతీయులంతా తప్పక చూడాల్సిన చిత్రమిది. ఈ సినిమా చూశాక భావోద్వేగంతో థియేటర్ నుంచి బయటకు వస్తారని నేను హామీ ఇస్తున్నా” అని మృణాల్ పేర్కొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com